రెప్పవాల్చని 'కళ్లు'

ప్రజాశక్తి

ఆదివారం అనుబంధం

నవంబర్ 08, 2015

పిడుగ్గాయలు









కితాబులకూ కింగే...

బాలీవుడ్ బాద్‌షాగా ఒక వెలుగు వెలుగుతున్న స్టార్ షారూక్ ఖాన్. 'దీవానా'తో (1992) సినీ రంగంలోకి అడుగెట్టిన ఎస్సార్కే ఇప్పటికి డెబ్బైకి పైగా చిత్రాల్లో నటించాడు. మొదట్లో రొమాంటిక్ చిత్రాలు ... తర్వాత యాక్షన్ సినిమాల ద్వారా ప్రేక్షకులను మెప్పించాడు. కరిష్మా నుంచి కాజోల్ వరకు ... మాధురీ దీక్షిత్ నుంచి అనుష్క శర్మ వరకు ఎందరో కథానాయికలు షారూక్ సరసన మెరిశారు. యాభై వసంతాలు పూర్తిచేసుకున్న బాద్‌షా గురించి సహనటీమణులు మంచి మార్కులే వేస్తున్నారు.

'మేం ఎప్పుడు ఎక్కడ కలిసినా చెప్పలేనంత సంతోషం, స్నేహం, ప్రేమ వెల్లివిరుస్తుంది. తనలా కష్టపడే వాళ్లని ఇంత వరకు చూడనేలేదు. సినిమాల కోసం, కుటుంబం కోసం 24 గంటలూ ఎప్పుడూ అందుబాటులో వుండడం అతనికే సాధ్యం' అని కితాబు ఇస్తోంది కాజోల్. 'షారూక్ సెట్‌లో వున్నాడంటే నవ్వులే నవ్వులు. తెగ జోక్స్ పేలుస్తాడు' అంటోంది రవీనా టాండాన్. 'సైఫ్ తర్వాత అత్యంత ధైర్యస్థుడు షారూక్. ఎంత చలాకీగా వుంటాడో పని పట్ల అంత అంకిత భావం ప్రదర్శిస్తాడు' అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తోంది కరిష్మా కపూర్. 'తోటి తారలతో చాలా కలుపుగోలుగా వుంటాడు. అదే సమయంలో ఎవరికి ఇవ్వాల్సిన గౌరవం వారికి ఇస్తాడు. ఏ విషయం గురించైనా సరే టకటకా మాట్లాడేస్తాడు' అంటోంది కత్రీనా. 'నా తొలి హీరో షారూక్ (బాజీగర్). తనతో పని చేయడమంటే కొత్త విషయాలను నేర్చుకోవడమే' అంటోంది శిల్పా షెట్టి. 'సినీ రంగంలో 'బెస్ట్' ఎవరు అంటే షారూక్. కష్టపడి పనిచేయడంలో అతనికి ఆకాశమే హద్దు' అంటోంది మాధురి దీక్షిత్. 'షారూక్ చాలా మంచి మనిషి. వేగం, హాస్యం, చురుకుతనం... తెలివితేటలు...అతనిలో మెండుగా వున్నాయి. అన్నిటిని మించి దయాగుణం ఎక్కువ' అంటోంది నేపాలీ నటి మనీషా కోయిరాలా. ఇవన్నీ చదివాక కితాబులు అందుకోవడంలోనూ షారూక్ ఖాన్ కింగే అనిపిస్తోంది కదూ.

ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

తుస్సు టపాసులు

దసరా సందడి పూర్తిగా మరువక ముందే హడావిడిగా వచ్చే పండుగ దీపావళి. వస్తే వచ్చింది. నింపాదిగా... వస్తుందా? ఊహూ! గోలగోలగా ధనాధన్ ఫటాఫట్ వచ్చి పడుతుంది. జిలిబిలి వెలుగులు ధనాధన్ శబ్దాలతో మోత మోగించేస్తుంది. చిన్నారుల సంతోషానికి ఆకాశమే హద్దు చేసేసి... పెద్దలను సైతం చెయ్యి పుచ్చుకుని బాల్యంలోకి లాక్కెళ్తుంది. ఆ స్ఫూర్తితోనే భారీ బాంబులు కాల్చేయమంటుంది.

పండుగకు వారం రోజుల ముందు నుంచే హడావిడి చేసేస్తారు పిల్లలు. చిచ్చుబుడ్లు, విష్ణు చక్రాలు, భూచక్రాలు, మతాబులు, కాకర పువ్వొత్తులు, ఔట్లు, వంకాయ బాంబులు, తాటాకు టపాకాయలు, నేల టపాకాయలు, అవ్వాయ్ చువ్వాయ్‌లు, తాళ్లు, పాములు ... అంటూ తమకు కావాల్సిన టపాసులతో ఇంత పొడవాటి జాబితా తయారుచేసి కొనిచ్చే వరకూ పెద్దలను కూర్చోనివ్వరు. నిలబడనివ్వరు. ఏ పని మీదా దృష్టి నిలపనివ్వరు. తీరా దీపావళి సరంజామా తీసుకొచ్చాక... వాటిని ఎండబెట్టడం, లెక్కించడం, దాచిపెట్టడంతో హడావుడి చేసేస్తారు. పండగనాడు టపాసుల వెలుగులన్నీ ఆ చిట్టి కళ్లల్లోనే ప్రతిబింబిస్తాయి.

దీపావళి నాడు చిన్నారుల తర్వాత హడావిడి అంతా పెద్దలదే. చూసి ఆనందించేవారు కొందరైతే... ఎంత భారీ బాంబునైనా చిటికెలో కాల్చేసేవారు మరికొందరు. ఇంకొందరుంటారు! ఆమడ దూరంలో టపాసు పెట్టి..కాకరపువ్వొత్తికి కర్ర కట్టి ... ధైర్యం కోసం మరొకరి చెయ్యి పట్టుకొని... భయం భయంగా అంటించి...ఎప్పుడు పేలుతుందా అని....చెవుల్లో వేళ్లు దూర్చి ...కళ్లు మూస్తూ తెరుస్తూ ఎదురు చూస్తుంటారు. ఇంత హడావిడి అయ్యాక అది తుస్సుమందనుకోండి! ఇరుగు పొరుగు మతాబుల్లాంటి తెల్లటి నవ్వుల పువ్వులు పూయిస్తారు.

ఇలాంటివాళ్లు రాజకీయ నేతల్లోనూ వుంటారు. కొందరు పవర్‌ఫుల్ బాంబుల్లా పనిచేస్తుంటారు. ఇచ్చిన మాటను, చేస్తామన్న పనిని దడదడా చేసి చూపిస్తారు. లక్ష్మీబాంబో, వంకాయబాంబో పేలినంత శక్తిమంతంగా వుంటుందా పని. ఇంకొందరు నేతలుంటారు. హడావిడిగా వాగ్దానం చేస్తారు. టీవీల్లో, పత్రికల్లో ప్రకటనలిస్తారు. ఓట్లు గుద్దించుకుంటారు. గద్దెనెక్కాక... 'ఇచ్చిన వాగ్దానం నెరవేర్చండి మహా ప్రభో!' అంటే... అటూ ఇటూ దిక్కులు చూస్తారు. 'ఆ పని చేయాలంటే వాళ్లు కూడా అంగీకరించాలి. వీళ్లు సహకరించాలి' అంటూ కాలహరణం చేస్తారు. తీరా పని చేసినట్టు నటించినా ఫలితాలు అవసరమైన వారికి చేరనే చేరవు. అచ్చం తుస్సు బాంబు లాగా అన్నమాట. ఎవరు పవర్‌ఫుల్ బాంబులో, ఎవరు తుస్సు బాంబులో ఒక్క ఓట్ల పండగతోనే తెలిసిపోతుంది.
కనక తుస్సు టపాసులను ఏరి అవతల పారేయడమే!

■

◆ మనలో మాట

టపా

సామాన్యుడి గుండె చప్పుడు

ఎందుకు పారేస్తాను నాన్నా? కథ గతంలో ఎన్నో సార్లు చదివినా..మళ్ళీ ఇప్పుడు చదివినా అదే ఆర్ద్రత, కృష్ణుడిలో అమాయకత్వం..నిజాయితీ కట్టిపడేస్తాయి. అట్టమీదికథ స్ఫూర్తి దాయకంగా ఉంది. 'కందిపప్పు కష్టాలు' సగటు మనిషి గుండె చప్పుళ్ళను వినిపించింది. ఉల్లిఘాటు, కందిపప్పులు, బస్ ఛార్జీల బాదుడు రేపు ఏం బాదుతారో? ఇలాంటి మరిన్ని విషయాలను ఇవ్వాలని కోరుకుంటున్నాం.

నేమాన సుభాష్ చంద్రబోస్,
పి.యం. పాలెం, విశాఖ పట్నం సిటీ.

కార్టూన్లు బాగున్నాయి

కవర్‌స్టోరీ 'వైకల్యాన్ని ఓడించి' మాలో కొత్త స్ఫూర్తిని, ఉత్సాహాన్ని నింపింది. కంది పప్పు కష్టాల గురించి మనలో మాటగా చక్కగా వివరించారు. కార్టున్ పంచ్‌లో కార్టూన్లు చాలా బాగున్నాయి. అల్లూరి సీతారామ రాజుకు సంబంధించిన వివరాలు చాలా ఆసక్తికరంగా ఉన్నాయి. చాగంటి సోమ యాజుల గారి కథ చాలా బాగుంది. ఇది చదువు విలువను తెలియ చేసే చక్కని కథ .

మార్తూరు అజయ్ కుమార్,
రామచంద్రాపురం, చిలుకలూరిపేట,
గుంటూరు

ఆసక్తికరం

ప్రపంచంలో అత్యంత పొడవుకాళ్ళ సుందరి హోలిబర్డ్‌కి ప్రత్యేక గుర్తింపు, మన దేశంలో తొలి మహిళా సర్ఫర్ 'ఇషితా' సాహస క్రీడల్లో సాధించిన రికార్డులు, క్రీడా మైదానంలో పారా అథ్లెట్లు విజయం కోసం చిందులేస్తున్న వారి క్రీడా స్ఫూర్తి తలుచుకుంటే ఉత్సాహంగా ఉంది. 1909 మొదలు అమెరికాలో ఓ పబ్లిక్ పార్క్‌లో ఏటా 600 వజ్రాలు ప్రజలు వెలికితీసి మూటకట్టుకుంటున్న వార్త అత్యంత ఆసక్తిని కలిగించింది.

టి. సత్యనారాయణ మూర్తి,
మల్కాపురం, విశాఖపట్నం

నిరూపించారు

అలనాటి తారల పాత్ర గ్రంథాలను తెరకెక్కించి వారి స్ఫూర్తితో మహిళ డైరెక్టర్లుగా రాణిస్తూ తమదైన ముద్ర వేస్తూ మహిళలు అన్నింటా ముందుంటారని నిరూపించారు ఈ దర్శక నిర్మాతలు. సముద్రపు అలల మీద సాహసం చేయడమంటే తమ చావుని తామే కోరి తెచ్చుకున్నట్టు అవుతుంది. అలాంటిది ఇషితా మాలవ్యా ఏకంగా సముద్రపు అలల మీద సర్ఫింగ్ చేయడం, పాఠాలు నేర్పడం నిజంగా అద్భుతం. నిద్ర లేచింది మహిళా లోకం... దద్దరిల్లింది పురుష ప్రపంచం... అన్నాడో సినీ గాయకుడు. అది నిజమని నిరూపిస్తున్నారు వీరు.

గంగాధర్, వేముల, పులివెందుల.

వైకల్యాన్ని ఓడించి...

ఈ వారం అట్టమీదికథ చాలా బాగుంది. వైకల్యాని ఓడించి అథ్లెట్స్‌గా నిలవడం గర్వకారణం. ఈ వ్యాసం ఎంతో మంది వికలాంగులకు ఆత్మ స్థైర్యాన్ని పెంపొందిస్తుందని ఆశిస్తు న్నాను. అలాగే ఎందుకు పారేస్తాను నాన్నా కథ చాలా బాగుంది.అల్లూరి సీతారామరాజు గురించి కాలగర్భంలో కలిసిపోయిన నిజాలను రచయిత పడాల వీరభద్రరావు వెలికితీసి అందరికీ అందివ్వడం మంచి విషయం.

మాధవి, నందలూరు, కడప.

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

ఈ సంచికలో....

పిడుగ్గాయలు

కవర్ స్టోరీ ———— 6

పదేళ్ల కల్లా సైన్స్ పట్టాలు, ఐదేళ్ల కల్లా మ్యూజిక్ కాన్సెర్ట్‌లు, మూడేళ్ల కల్లా యోగా విన్యాసాలు, ఏడాది కల్లా కవ్వింతలు, ఆరు మాసాలకే కాలింగ్‌లు.... పిల్లల గురించి ఇలా ఏది విన్నా వాళ్లు పిల్లలు కాదు పిడుగులు అనేస్తాం. బాలమేధావి అని బిరుదు తలకెక్కించేస్తాం. ఐన్‌స్టీన్ ఐక్యూను దాటేస్తున్న చిచ్చరపిడుగుల లిస్టు పెరుగుతోంది. ఈ వండర్ కైండ్ కిడ్స్‌లా మీ ఇంట్లోను పాకేస్తుంటారు గమనించండి. ప్రతి ఇంట్లోను చిన్ని చేతులు, చిట్టి బుర్రలు అద్భుతాల్ని చేయగలవు. ఈ పిల్ల టపాసులు వాతావరణం అనుకూలిస్తే కచ్చితంగా పేలతాయి. అది ముందా, నిదానంగానా అనేది కాదు ముఖ్యం.

పోరు 3
అభద్రలకు అండా దండా 'ఎర్ర దండు'

ప్రత్యేకం 4
పక్షి ప్రేమికుడు

కార్టూన్ పంచ్ 5

సృజన 10
రెండో సూరీడు

నవ్వుల్ పువ్వుల్ 11

సినిమా కబుర్లు 14
రెప్ప వాల్చని కళ్ళు

వింత లోకం 16
టాటూ హిట్టే

తెలుసా 17
చంబా రుమాల్

కథ 18
పల్లకీ కుచ్చు

రుచి 21
వంకాయ రైస్

బాల నేస్తాలు 22
బుజ్జి స్టార్

కొత్త పుస్తకాలు 24
వి.యన్. జంషీద్ ఖాన్



టెక్ గురూ -12
ఫోన్ పోయిందా?
పట్టుకోండిలా..!

ఆంధ్ర రాష్ట్రమైనా... మహారాష్ట్రమైనా ... ఆడవాళ్ల కష్టాల్లో పెద్దగా మార్పులేం లేవు. అవే అసమానతలు, ఆరళ్లు, వేధింపులు, చిత్రహింసలు. ఎన్నో అడ్డంకులను అధిగమించి స్కూళ్లలో, కాలేజీల్లో చేరిన అమ్మాయిలకు లైంగిక వేధింపులు, మృగాళ్ల దాడులు అనూహ్యంగా ఎదురౌతున్నాయి. వివాహితలకు తాగుబోతు భర్తలు, వరకట్న పిశాచుల చేతుల్లో నరకయాతనలు తప్పడం లేదు. నిస్సహాయులైన బాధిత మహిళలకు అండగా మేమున్నామంటూ భరోసా కల్పిస్తోంది 'అహల్యా తాయి రంగ్నేకర్ బ్రిగేడ్'.

అభద్రలకు అండా దండా 'ఎర్ర దండు'

గృహ హింస, లైంగిక వేధింపులు, అవినీతి జలగల సమస్యలు...ఏవైనా సరే ఈ దండు చేపడుతుంది. ఏర్పడిన మూడేళ్లలో ఇప్పటి వరకు 124 కేసులను పరిష్కరించింది. మొట్టమొదటి కేసు ఆ బృంద సభ్యురాలిదే కావడం యాదృచ్ఛికం. భర్త రోజూ తాగొచ్చి ఆమెను చితక బాదేవాడు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా అది వారి 'కుటుంబ వ్యవహారం' అంటూ పట్టించుకునేవారు కాదు. సమస్య పరిష్కారానికి ఎర్ర దండు రంగప్రవేశం చేసింది. ఓరోజు దండు సభ్యులు వెళ్లేసరికి అతనామెను విచక్షణా రహితంగా తంతున్నాడు. ఎంత చెప్పినా వినలేదు సరికదా మరింతగా కొట్టసాగాడు. పైగా దండు సభ్యులను కూడా దుర్భాషలాడాడు. దాంతో అందరూ కలిసి అతన్ని బయటికి లాగి పోలీస్ స్టేషన్‌కి తీసుకెళ్లారు. అతగాడు ఊరుకున్నాడా! ఎర్రదండు తన పరువు తీస్తోందని ఎదురు దాడికి దిగాడు. పరువు ప్రతిష్టలు కావాలంటే భార్యను కొట్టొద్దని హితవు చెప్పారు. ఆ తర్వాత అతను భార్యను కొట్టడం మానేశాడు. పైగా ఆమెను దండు కార్యకలాపాల్లో పాల్గొనడానికి ఎప్పుడూ అడ్డు చెప్పలేదు సరికదా అప్పుడప్పుడూ అతను కూడా హాజరౌతున్నాడు. ఎర్రదండు పరిష్కరించిన మరో కేసు పూణే యూనివర్సిటీ విద్యార్థినులది. ప్రొఫెసర్ రూపంలో వున్న మృగాడు విద్యార్థినులను లైంగిక వేధింపులకు గురిచేయడమే కాక... ఆ ఘోరాన్ని బైట పెట్టవద్దంటూ బ్లాక్‌మెయిల్ చేయడంతో వారు ఎర్రదండును ఆశ్రయించారు. యూనివర్సిటీకి వెళ్లి అతగాడి బాగోతాన్ని బహిర్గతం చేసి అతన్ని విధుల నుంచి తొలగించమని డిమాండ్ చేశారు ఎర్రదండు సభ్యులు. ఆ తర్వాత కేసు వేయడంతో అతనికి మూడేళ్ల జైలు శిక్ష కూడా పడింది. వేధించే వారికే కాదు... అవినీతి జలగలకూ బుద్ధి చెప్తున్నారు. కల్తీ బియ్యం అమ్ముతున్న చవక రేషన్ దుకాణదారుల అవినీతిని బైటపెట్టి బుద్ధిగా నడుచుకునేలా చేశారు. కల్తీ మద్యం అమ్మడం ద్వారా వంద మంది చనిపోవడానికి కారకులైన షాపు యజమానులను రచ్చకీడ్చడమే కాక ఆ షాపులు మూసివేసే దాకా పోరాడారు.

ఎర్రదండు కదులుతుందిలా...

మహారాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ మహిళా నేత అహల్యా రంగ్నేకర్ పేర స్థాపించినదే ఈ బ్రిగేడ్. దీన్నే 'రెడ్ బ్రిగేడ్' (ఎర్ర దండు) అని కూడా పిల్చుకుంటారు. 2012 జనవరి 3 న అపర్ణ దరాడె ఈ ఎర్రదండును ఏర్పాటు చేసింది. ప్రారంభంలో ఈ దండు సభ్యులు పదుల సంఖ్యలో వుండేవారు. ప్రస్తుతం వేలల్లోకి పెరిగింది. సమస్యను చేపట్టినప్పుడు సభ్యులంతా ఎరుపు చీరలు కట్టుకుటుంటారు. మూడు దశల్లో పరిష్కారానికి ప్రయత్నిస్తారు. ముందుగా దండు అధ్యక్షురాలు అపర్ణ, ఇతర కమిటీ సభ్యులు లాయర్‌తో కలిసి బాధిత తరపున వేధింపులకు కారణమైన వారికి ఒక లేఖ పంపుతారు. అందులో అసలు సమస్యను ప్రస్తావించడమే కాక దాని పరిష్కార మార్గాన్ని సూచిస్తారు. రెండవ దశలో పోలీసు అధికారులను, న్యాయాధికారులను కలుస్తారు. మూడవ దశలో ఎర్ర చీరలు కట్టుకున్న బృంద సభ్యులు ముప్పై నుంచి మూడు వందల మంది వరకు వెళ్లి సమస్యకు కారకుడైన వ్యక్తిని చుట్టుముట్టి నిరంతరాయంగా డప్పులు మోగిస్తారు. అదే సమయంలో అతగాణ్ణి పద్ధతి మార్చుకోమని కూడా చెప్తారు. దాంతో అప్పటి వరకు నాలుగు గోడలకే పరిమితమైన సమస్య పదిమందికీ తెలుస్తుంది. పీకల దాకా తాగి వచ్చి విచక్షణ మరచి భార్యను పెడుతున్న హింస గురించి, అదనపు కట్నం కోసం చేస్తున్న వేధింపుల గురించి, అక్రమార్కుల అవినీతి గురించి అందరికీ తెలిసిపోతుంది. ఇది నచ్చని కొందరు ఎర్ర దండు లేఖ పంపిన తొలి దశలోనే ఏదో రకంగా సమస్యను పరిష్కరించుకోవడానికి ప్రయత్నిస్తుంటారు.

వందలాది కేసుల్లో తీవ్రంగా గాయపడిన బాధిత మహిళలను చూసిన రెడ్ బ్రిగేడ్ మరో ఆలోచన కూడా చేసింది. వారికి అత్యవసర వైద్య చికిత్సలు, న్యాయ సహాయం అందించడానికి ఒక 'ఎమర్జన్సీ క్లినిక్– ఆకృది'ని కూడా ఏర్పాటు చేసింది. మారుమూల గ్రామాల నుంచి యూనివర్సిటీ అమ్మాయిల వరకూ ఎవరికి ఏ సమస్య ఎదురైనా ఎర్రదండు సిద్ధంగా వుంటోంది.

ప్రత్యేకం

పొద్దున లేచింది మొదలు ఉరుకులు పరుగులు. పరిసరాల్లో జరుగుతున్నవేవీ పట్టించుకోలేనంతగా ఊపిరాడనివ్వని పనులు. రైల్వే స్టేషన్ దగ్గర రోజంతా ఖాళీ కడుపుతో పడి వున్న వృద్ధురాలిని ఎంత మందిమి గమనిస్తాం? రెడ్ సిగ్నల్ పడిన చోట... కారు అద్దాల్లోంచి బొమ్మలు అమ్మే పిల్లాడి గురించి ఎంతమందిమి ఆలోచిస్తాం? మనుషుల సంగతి సరే! మన రోడ్డు చివర చెత్త డబ్బాలోంచి ఆహారం వెతుక్కుంటున్న వీధి కుక్క ఆకలి గురించి ఎంతమందిమి ఆలోచిస్తాం? ఇక పక్షుల సంగతి సరేసరి! కానీ చెన్నైకి చెందిన సి.శేఖర్ అలా కాదు. పక్షుల ఆకలిని ఆర్ద్రతతో అర్థం చేసుకున్నాడు. వాటికోసం మనసున్న మనిషిగా ఆలోచన చేశాడు. గత పదేళ్లగా ఒక్క పూట కూడా బద్దకించకుండా వాటికి ఆహారం అందిస్తున్నాడు.



సి.శేఖర్

పక్షి ప్రేమికుడు



చెన్నై రోయపేటలోని భారతి వీధిలో ఉండే పక్షి ప్రేమికుడు శేఖర్ గురించి అక్కడ తెలియని వారుండరు. అతనికి తెల్లవారుజామున 4.30 గంటలకే రోజు మొదలౌతుంది. ప్రియాతిప్రియమైన పావురాళ్లు, చిలకల కోసం ప్రతిరోజూ అంత పొద్దున్నే లేచి అన్నం వండుతాడు. కాకులు, ఉడుతలు కూడా వచ్చినా వాటి సంఖ్య తక్కువగానే వుంటుంది. ఆ తర్వాత వండిన అన్నాన్ని తన ఇంటి వెనక వసారాలో 14 వరుసల్లో పొడవుగా ఏర్పాటు చేసిన చెక్కబల్లలపై అమరుస్తాడు. సుమారుగా 6 గంటలకల్లా ఆ పని పూర్తయిపోతుంది. ఇక చుట్టు పక్కల పక్షులు గుంపులు గుంపులుగా వచ్చి వాలిపోతాయి. ఆకలి తీరాక అక్కడే ఏర్పాటు చేసిన నీళ్లు కూడా తాగేసి తృప్తిగా ఎగురుకుంటూ వెళ్లిపోతాయి. సాయంత్రం 4 గంటలకు తిరిగి బియ్యం, ధాన్యాలు కలిపి వండేస్తాడు. అదే పద్ధతిలో పెరట్లో చెక్కబల్లలమీద అన్నం అమర్చుతాడు. పొద్దుటి ప్రకారమే పక్షులన్నీ అక్కడికి చేరుకుని తమకోసం ఏర్పాటు చేసిన విందును ఆరగించి వెళ్లిపోతాయి. ఇలా గత పదేళ్లగా జరుగుతోంది. ఏదైనా పనిలో పడి ఎప్పుడైనా తను అన్నం తినడం మర్చిపోయాడేమో కానీ... ఈ పక్షులకు మాత్రం అన్నం వండి పెట్టడం విస్మరించలేదు శేఖర్. నిజానికి ఇదంతా భారత ఉపఖండాన్ని సునామీ తాకినప్పుడు మొదలైంది. ఆ రోజున రెండు చిలుకలు వర్షంలో పూర్తిగా తడిచిపోయి...ఆహారం వెతుక్కుంటూ శేఖర్ వాళ్ల ఇంటి పెరట్లో వాలాయి. వాటిని ఆ స్థితిలో చూసిన అతను వెంటనే కాస్తంత అన్నం, కాసిని గింజలు వేశాడు. వాటిని చూసి పావురాళ్లు కూడా వచ్చి వాలాయి. అయితే క్రమేణా అక్కడికి ఆహారం కోసం వచ్చే చిలుకల సంఖ్య బాగా పెరిగిపోయింది. ప్రస్తుతానికి 4,500 చిలుకలు వస్తాయి. రెండు పూటలా వాటికోసం 60 కేజీల బియ్యం వండి పెడతాడు. ఆ ఏర్పాట్లలో తన వాచీల షాపులో పనిచేసేవారేకాక ఇరుగు పొరుగు ఔత్సాహికులు కూడా సాయం చేస్తుంటారు.

మనసున్న మెకానిక్

'బర్డ్‌మేన్ ఆఫ్ చెన్నై'గా గుర్తింపు పొందిన శేఖర్ వృత్తిరీత్యా కెమెరా మెకానిక్. ఎలక్ట్రానిక్స్‌లో డిప్లొమా చేసిన ఇతను టి.వి, వి.సి.ఆర్ మరమ్మతులు చేసేవాడు. కానీ తర్వాత తనకెంతో ఇష్టమైన పాత కాలం నాటి కెమెరాల సేకరణ చేయడం మొదలెట్టాడు. ప్రస్తుతానికి అతని 'కెమెరా హౌస్'లో 4,500 కెమెరాలున్నాయి. వాటి మరమ్మతులూ చేస్తాడు. ఈ విషయం తెలిసిన విదేశీయులెందరో వాటిని తమకు అమ్మమని అడుగుతుంటారు. అయితే వాటిని అమ్మే ఉద్దేశ్యం తనకు లేదని సున్నితంగా తిరస్కరిస్తుంటాడు. అయితే ఇంట్లోనే ఆఫీసు కూడా వుండడంతో పక్షులకు ఆహారం సిద్ధం చేసేందుకు వీలుగా సాయంత్రం 4 నుంచి 6.30 గంటల వరకు పనిలో విరామం తీసుకుంటాడు.

వివిధ వార్తా చానళ్లు, పత్రికలు, సంస్థల ప్రతినిధులు వచ్చి శేఖర్‌ను అభినందనలతో ముంచెత్తి...ఇంటర్వ్యూలు తీసుకెళుతుంటారు. పత్రికల్లో ప్రత్యేక కథనాలూ ప్రచురిస్తుంటారు. అయితే అంతకు మించి ఏ విధమైన సాయం ఎవ్వరి దగ్గర నుంచి రాకపోవడమే అతన్ని నిరాశ పరుస్తుంటుంది. పక్షులకు ఆహారం అందించ డమనేది తనకేదో భారమై కాదు. తన ఆదాయంలో నలభై శాతం వాటికోసమే ఖర్చు చేస్తాడు. ఆ మూగ జీవుల పట్ల సాటి మనుషుల్లో స్పందన, ప్రేమ కరవైనం దుకే అతని బాధంతా !

రాజధాని


విడదీయరాని అనుబంధం మనది!!
?!


?!
అసహనంపై నిరసన

నీకూడా పోడా.. కావాలా నాయనా!!

పంచ్ కార్టూన్


అంతా ఆయనే చూసుకుంటాడు
?!
నూతన మత్స్యవిధానం

పిడుగ్గాయులు

పదేళ్ల కల్లా సైన్స్ పట్టాలు, ఐదేళ్ల కల్లా మ్యూజిక్ కాన్సెర్ట్‌లు, మూడేళ్ల కల్లా యోగా విన్యాసాలు, ఏడాది కల్లా కవ్వింతలు, ఆరు మాసాలకే కాలింగ్‌లు.... పిల్లల గురించి ఇలా ఏది విన్నా వాళ్లు పిల్లలు కాదు పిడుగులు అనేస్తాం. బాలమేధావి అని బిరుదు తలకెక్కించేస్తాం. ఐన్‌స్టీన్ ఐక్యూను దాటేస్తున్న చిచ్చరపిడుగుల లిస్టు పెరుగుతోంది. ఈ వండర్ క్రైండ్ కిడ్స్‌లా మీ ఇంట్లోను పాకేస్తుంటారు గమనించండి. ప్రతి ఇంట్లోని చిన్ని చేతులు, చిట్టి బుర్రలు అద్భుతాల్ని చేయగలవు. ఈ పిల్ల టపాసులు వాతావరణం అనుకూలిస్తే కచ్చితంగా పేలతాయి. అది ముందా, నిదానంగానా అనేది కాదు ముఖ్యం.

అజయ్ కుమార్ వారాల
9502395077

స్కూల్‌కు వెళ్లనంటూ తండ్రి రెండు కాళ్లకూ చుట్టుకుని రొప్పుతూ ఏడ్చే పిల్లల్ని చూసి జాలిపడే వారికి అదే వయసు పాప నాలుగైదు పైతరగతుల పరీక్షల్ని దాటేసిందని వినేసరికి తుళ్లిపడతారు. అదే అమ్మాయి 11 ఏళ్లకే పీజీని పూర్తి చేసిందని చెబితే నోరెళ్లబెట్టక ఏంచేస్తాం. తాత కొనిపించిన బొమ్మ డోలు మెడకు తగిలించుకుని చెవులు చిల్లులు పడేలా మోగించే నాలుగేళ్ల బుడతడి అల్లరి భరించలేక బళ్లో వేస్తేగానీ వీడి తిక్క కుదరదని రాగమందుకునే తల్లుల్ని చూస్తూనే ఉంటాం. కానీ అదే వయసుకు ఓ బుడ్డోడు పెద్ద ప్రొఫెషనల్ పియానిస్ట్‌లా థియేట్రికల్ షో టీవీలో వేస్తే రెప్ప వాల్చకుండా చూస్తాం. ఆ మధ్య మన భారత సంతతి బాల మేధావి లిడియా సెబాస్టిన్ ఏకంగా 162 పాయింట్లతో ఐన్‌స్టీన్, స్టీఫెన్ హ్యాకింగ్‌లను దాటేసి రికార్డు సృష్టించింది. ఈ బాలమేధావుల ఆచూకీ పదివేల ఏళ్ల క్రితమే రికార్డు అయి ఉంది. ఇప్పటికీ కొత్త పట్టికలు తయారవుతూనే ఉన్నాయి.

ఏడేళ్లకే సర్జరీ గ్లోవ్స్

పది నెలల వయసులో నడక నేర్చి 12 ఏళ్లకు వైద్య విద్యార్థి అయిపోయాడు ఆకృత్ జస్వాల్. ఐక్యూలో 146 పాయింట్లు సాధించిన జస్వాల్ ఏడేళ్ల వయసున్నపుడు తొలిసారి వేళ్లకు సంబంధించి ఓ చిన్న సర్జరీ విజయవంతంగా చేసేశాడు. క్యేన్సర్‌కు పరిష్కారం వెదికే దిశలో రసాయన శాస్త్రంలో చదువు కొనసాగిస్తున్నాడు.



ప్రస్తుతం జస్వాల్ టీనేజీ దాటేశాడు. ఓప్రా విన్‌ఫ్రే షోలోను పాల్గొని ఆహుతుల్ని తన సమాధానాలతో ఆశ్చర్యపరిచాడు.

13 ఏళ్ల మైక్రో బయాలజిస్ట్

చదువుల కొలువు ఏదైనా ఉంటే.అది సుష్మ వర్మ ఇల్లే. లక్నోకు చెందిన సుష్మ కుటుంబంలో ముందు తరంలో పెద్ద చదువులు చదివిన వాళ్లు ఎవరూ లేరు. తల్లిదండ్రులిద్దరివీ అంతంత మాత్రం చదువులే. తండ్రి పారిశుద్ధ్య కార్మికుడు. తల్లి గృహిణి. కానీ వీరి పిల్లలు ముగ్గురూ చదువుల్లో చాలా చాలా ముందున్నారు. సుష్మ ఏడేళ్లకు పదో తరగతి పూర్తి చేసి 13 ఏళ్లకే మైక్రోబయాలజీలో మాస్టర్స్ డిగ్రీలో చేరింది. 12 ఏళ్లకు ఎంబీబీఎస్ కంబైన్డ్ ప్రీ మెడికల్ టెస్ట్ రాసినా వయసు

అర్హతలేని కారణంగా ఆమె ఫలితాల్ని వెల్లడించలేదు. అందుకే మైక్రోబయాలజీని ఎంచుకుంది. సుష్మ అన్న శైలేంద్ర కూడా పదేళ్ల లోపే పది పూర్తిచేశాడు. వారి చిన్న చెల్లెలు అనన్య నాలుగేళ్లకే 6వ తరగతి పాఠాల్ని అరాయించేసుకుని ఆశ్చర్యపరుస్తోంది.

చిట్టి ఐటీషియన్

18 నెలలకు కంప్యూటర్‌ను ఆపరేట్ చేసిన అజయ్ పూరి నాలుగేళ్లొచ్చేసరికి సొంత వెబ్‌పేజీని రూపొందించుకున్నాడు. ప్రపంచంలోనే అత్యంత చిన్న వయసులో వెబ్‌సైట్ డిజైనర్‌గా ఆశ్చర్యపరిచిన

అజయ్‌ను బిల్‌గేట్స్‌లాంటి ఐటీ దిగ్గజాలు ప్రశంసలతో ముంచెత్తారు. బుడతలు బొమ్మ కార్లతో కుస్తీ పడుతున్న వయసు నాటికే మైక్రోసాఫ్ట్ ప్రోడక్ట్‌లను ఓ ఆట ఆడుకున్నాడు. ఈ మెయిల్స్ కూడా పంపించగలిగాడు. ఇప్పుడు అతడికి 17 ఏళ్లు నిండాయి.

చెస్ మేటి

బీహార్‌కు చెందిన పారీ సిన్హా చదరంగంలో మేటి. తన వయసుకు రెండు రెట్లున్న క్రీడాకారులకు

చెక్‌మేట్ చెప్పే ఈ నాలుగేళ్ల చిన్నారి స్టేట్ చాంపియన్‌షిప్‌లో పోడియం ఫినిష్ చేయగలిగింది. చాలా చురుగ్గా పావులు కదిపే ఈ చిన్నారి వేసే ఎత్తులు మాత్రం చాలా సేపు ప్రత్యర్థిని ఆలోచనలో పడేస్తాయి.

పిల్ల కాలిక్యులేటర్

ప్రియాన్షి సోమానిని అందరూ హ్యూమన్ కాలిక్యులేటర్ అని పిలుస్తారు. 12 ఏళ్ల వయసున్నప్పుడు ఆమె మెంటల్ కాలిక్యులేషన్ వరల్డ్ కప్‌ను గెలిచింది. ఆరేళ్లకే మెంటల్ కాలిక్యులేషన్ అభ్యసన మొదలెట్టిన ఈ గుజరాతీ.. జర్మనీ వేదికగా లెక్కగట్టిన మొత్తాల్ని చూసి పెద్ద వాళ్లే బిత్తరపోయారట.

ప్రియాన్షి లెక్కలు కట్టే వేగం, సంఖ్యలపై గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్, లిమ్కా రికార్డ్‌లు నమోదయ్యాయి.

గూగుల్ బుడతడు

కౌన్ బనేగా కరోడ్‌పతీ ద్వారా దేశం మొత్తానికి షాక్ ఇచ్చాడు కౌటిల్యా పండిట్. హర్యానాలోని ఓ చిన్ని గ్రామం నుంచి వచ్చిన ఆ పిల్లాడు అడిగిన ప్రశ్నలకు వెదుక్కోకుండా సమాధానాలు టపీటపీమని చెప్పేస్తుండటం భ్రమలా అనిపించింది. గూగుల్ బోయ్‌గా పేరు పెట్టేశారు. జీడీపీ దగ్గర నుంచి దేశ జనాభా వరకు ఎన్నో విషయాల సమాచారం ఈ చిట్టి బుర్రలో చాలా భద్రంగా ఉంది.

పూర్తి చేసిన బాలమురళీ ఎయిడ్స్‌పై ఓ పరిశోధనాత్మక పుస్తకానికి సహ వ్యాసకుడు కూడా.

ఏడేళ్లలోపు 30 వేల చిత్రాలు

కేరళలో ఓ రహదారి పేరు ఎడ్మండ్ థామస్ క్లింట్. ఇది ఓ బాలుడి పేర ఏర్పాటు చేశారు. ఏడేళ్ల వయసు నాటికి 30 వేలకు పైగా అద్భుతమైన పెయింటింగ్స్ వేశాడు ఎడ్మండ్. బలపం చేతికందిన తొలిసారే గుండ్రటి సున్నా చుట్టి ప్రత్యేకతను తల్లిదండ్రులకు తెలియజేసిన ఎడ్మండ్ కిడ్నీ వ్యాధితో చనిపోయాడు.

కొన్ని రోజుల ముచ్చటే

శాస్త్రవేత్త, వైద్యుడు, ఆర్టిస్ట్, గణిత మేధావి, మ్యుజీషియన్, చిత్రకారుడు ఆఖరకు దొంగను, క్రిమినల్ చేయడానికైనా ఓ పద్ధతి ఉంది అని చాలామంది మానసికవేత్తల మాట. దాన్ని ఆసరాగా తీసుకుని కొన్ని ప్రకటనలు కన్పిస్తున్నాయి. ముందు నుంచి ఓ పథకం ప్రకారం వాతావరణాన్ని చుట్టుతా ఏర్పాటు చేసి ఎంపికను నియంత్రించి బలవంతం చేయడం సరైంది కాదు. తొలుత రేసులో ముందున్నా ఆ తర్వాత క్రమంగా మిగతా పిల్లలూ వేగం పుంజుకుంటారు ఒక దశకు చేరే సరికి అందరూ సమానమైపోతారు. చాలా మంది జీవితాలు ఆ తర్వాత చాలా సాధారణంగా ఉంటాయనేది చాలా సర్వేలు, పరిశోధనల్లోను తేలింది. దీనికి కారణం ముందు చెప్పినట్టు సమాన అవకాశాలు, అనుకూలతలు, మేధా వృద్ధి, పోటీ ఓ కారణమైతే మరో కారణం ఈ బాల మేధావులు పెద్దల జోన్‌లో పడిపోతారు. అక్కడ వాళ్లు యావరేజీగా ఉండే చాన్సే ఎక్కువ. ముఖ్యంగా అకడమిక్ విషయాల్లో సాటి విద్యార్థులంతా పెద్దవాళ్లు కావడంతో బాల మేధావుల కన్నా కొన్ని అనుకూలతలు ఎక్కువవడం ఒకటి. సబ్జెక్ట్ విస్తృతి పెరగడం మరొకటి. చాలా వరకు బాలమేధావులు ఫలితాలు, మార్కుల్లో మొస్తరుగానే ఉండటం కనిపిస్తోంది మరి.

13 ఏళ్లకు 20 వేల ఏళ్ల కేలండర్

తెలుగువాడైన ప్రవీణ్ కుమార్ గోరకవి 13 ఏళ్ల వయసు నాటికే గణిత సూత్రాల లాజిక్ పట్టేశాడు. వాటి ఆధారంగా 20 వేల ఏళ్లకు సరిపడా కేలండర్‌ను రూపొందించాడు. 27 సూత్రాల ఆధారంగా 40 వేల ఏళ్ల వరకు కేలండర్ రెండర్ చేసి దాన్ని అంధులకు అనుకూలంగా బ్రెయిలీ లిపిలోకి తర్జుమా చేసి చూపాడు. 15 ఏళ్లకే మడిమ, మోకాలు కదలికలకు వీలుగా ఉండే కృత్రిమ కాలును రూపొందించాడు.

పదిహేడేళ్ల ఎండీ

బాలమురళీ అంబటి అనే మరో తెలుగు తేజం ప్రపంచంలో అతి చిన్న వయసున్న డాక్టర్‌గా గుర్తింపు పొందాడు. 17 ఏళ్లకు కంటి చికిత్సలో ఎండీ



వండర్ కిడ్ అనండీ, చైల్డ్ ప్రొడిగీ అనండీ ఈ బాల మేధావుల లోగుట్టు, కిటుకు పట్టేందుకు చాలా ప్రయోగాలే జరిగాయి. చాలా పరిశోధనలే సాగాయి. బాలమేధావుల చిక్కుముడిని మరింత జటిలం చేస్తూ పోయారు. జన్యువుల్ని విజేతలుగా ప్రకటించడానికి తొలినాళ్లలో వాటి ప్రభావం 10 శాతానికి మించదని అనడానికి ఉదాహరణగా చదువు అంతగా అబ్బని తల్లిదండ్రులకు పుట్టిన పిల్లలు ముగ్గురూ అకడెమిక్ ప్రొడిగీలే. బలవంతాన అని అందామంటే చదువు తప్ప మరో అవకాశం లేకుండా ఒంటరి గదిలో పడేసిన తండ్రికి చిక్కకుండా వాద్య సంగీతంలో రారాజుగా వెలిగిన వండర్ కిడ్‌దో కథ. చుట్టూ ఉన్న నేపథ్య ప్రభావమందామంటే కడుపు నొప్పితో ఓ పేదింటికే పరిమితమైన పిల్లాడు గొప్ప చిత్రాలు గీసేశాడు. పోనీ అదో మిరకల్ అని చేతులు దులుపుకుందామంటే మరి అంకెల గారడీలో చెలరేగిపోయినట్టు భాష దగ్గరకొచ్చేసరికి సరకు ఎందుకు ఉండదో అస్సలు అర్థం కాదు. పోనీ ఏవైనా ఇంద్రియ, మానసిక, శారీరక పరిస్థితులు ప్రత్యేక శక్తిని ప్రేరేపించాయా అని ఆలోచిస్తే మరి

అదే పరిస్థితిలో ఉన్న ప్రతి చిన్నారి అదే రిజల్ట్ కనబరచాలి కదా.

'పసి'డి హింట్‌లు

ఎదగడానికెందుకురా తొందర.. ముందర బతుకంతా చిందరవందర అని పాత పాట పాడే చాన్సే ఇవ్వరు కొందరు భడవలు. చాలా ముందరిగానే బాల మేధావుల్ని గుర్తు పట్టేయొచ్చని కొందరి వాదన. చిన్నారులు ఏ విషయంలో నిష్ణాతులయ్యే అవకాశముందనే విషయాన్ని ముందే పట్టేస్తే సరైన వాతావరణాన్ని ఏర్పాటు చేసి ఆ రంగాల్లో దూసుకెళ్లేలా చేయొచ్చనేది వారి తాపత్రయం. న్యూయార్క్ టైమ్స్‌లాంటి పత్రికలు, మెన్సా లాంటి సంస్థలు, డేవిడ్ ఫెల్డ్‌మ్ లాంటి ప్రఖ్యాత శిశుమనోవైద్యులు రెండేళ్లలోపే పిల్లలు తమ ప్రజ్ఞాపాటవాలు ఏ రంగంలో ఉండబోతున్నాయనే విషయంపై హింట్‌లు ఇస్తారని అంటారు. వారు ఎదిగే క్రమంలో కొన్ని అంశాలపై ప్రత్యేక ఆసక్తిని, ప్రతిభను కనబరుస్తూ ఉంటారు. వారిని కట్టిపడేసే ఆ విషయాలపై తల్లిదండ్రులు కూడా శ్రద్ధ పెట్టి తగిన వాతావరణాన్ని, అవకాశాల్ని ముఖ్యంగా ప్రోత్సాహాన్ని అందిస్తే చాలా తక్కువ సమయంలో ఆయా విషయాల్లో విశేష ప్రతిభాపాటవాల్ని ప్రదర్శిస్తారు చిన్నారులు. వారికి ఆ తరహా పరిణతి కూడా ఇబ్బంది కలిగించదు. ఆసక్తి ఉన్న అంశాలు కష్టమైనవైనా చాలా తేలిగ్గా అర్థం చేసుకోగలరు. ఒత్తిడికి లోనవకుండా సాధనా చేయగలరు. అనుకూలత కూడా కలిసి వస్తుంది. మనోశాస్త్రవేత్త కె.ఆండర్స్ ఎరిక్‌సన్ ఉద్ఘాటించిన స్కిల్ మాస్టరీ కీలకాంశాన్ని మాల్కమ్ గ్లాడ్‌వెల్ 'ఔట్‌లైయర్స్', జెఫ్ కాల్విన్స్ 'టాలెంట్ ఓవర్‌రేటెడ్' పుస్తకాల్లో పేర్కొన్నారు. కాలానుగుణంగా స్థిరమైన, ఉద్దేశపూర్వకమైన, ఇష్టానుపూర్వకమైన సాధన,ఆసక్తి, స్వయం ప్రేరణ ఆచరణే ఆ కీలకాంశం. సంగీత రారాజు గ్రేట్ పియానిస్ట్ మొజార్ట్ విషయంలో జరిగిందదే. తండ్రి రూపంలో ఆశించే వ్యక్తికి తోడు గురువుల రూపంలోను డిమాండింగ్ రెట్టింపవడంతో అతడి తృష్ణకు తోడు మూడేళ్లకే పియానో పాఠాలు నిష్ణాతుల నుంచి అందుకున్నాడు.

గురుతే గుర్తు

వీళ్లకు మెమరీ చాలా ఎక్కువ. ఎప్పుడో ఒకసారి చూసిన బంధువుల్ని మరోసారి చూసి చూడగానే గుర్తుపట్టి నవ్వేస్తారట ఈ వండర్‌కైండ్‌లు (జర్మన్‌లో ఇలా అర్థమిచ్చే ఈ మాట నుంచే బాలమేధావులకు పేరు పెట్టడం మొదలైంది). తరచూ తీసుకెళ్లే చోటు నుంచి ఇంటికి దారి చెప్పేస్తే కాస్త ఆలోచించాల్సిందే. చాలామంది చిన్న పిల్లలు ఎపుడో ఒకసారి కనిపించే వారిని ఇట్టే మరిచిపోతారు. కానీ గుర్తుంచుకో గలుగుతున్నారంటే మెమరీకి సంబంధించిన విషయాలపై శిక్షణనిస్తే మంచిది.

అక్షరాలతో మాల

చాలా త్వరగా చదువు మొదలెట్టేసే బ్యాచ్ వీళ్లది. ఏదో పేజీలు తిరగేయడం కాదులెండీ తోటి పిల్లల కన్నా ముందుగా పదాల్ని గటాగటా తాగేస్తూ చకచకా పేజీల్ని చదివేస్తే ఆలోచించాల్సిందే. ఎప్పుడూ పుస్తకాలతోనే కుస్తీలు, కునుకుపాట్లు చేస్తుంటే ఆ చిట్టి బుర్రల్ని చదివింపజేసే పుస్తకాలు నాలుగైదు ఎక్కువే కొనేయండి.

వయసుకు మించిన..

వీళ్ల అలవాట్లు, హాబీలు, అభిరుచులు కాస్తేంటి చాలా తేడా. అన్ని వయసుకు మించి, అసాధారణ ఆసక్తులే ఉంటాయి. బొమ్మకార్లతో ఆటలు కాకుండా కార్ల ఇంజిన్ల గురించి సిరీస్‌ల గురించి మాట్లాడుతుంటే కాస్త పరికించండి. గాలిపటాల్ని చూడటం నా హాబీ అని ముద్దులొలకకుండా విమానాల్లో తేడాల గురించి తలపట్టుకు కూర్చుని సుదీర్ఘంగా ఆకాశం వంక చూస్తుంటే మాత్రం వెంటనే అలెర్టయిపోండి.

లోకం పోకడలు ఎరుకే

ప్రపంచ విషయాలపై వీరికి అవగాహన ఎక్కువ. లల్లబీలు కాకుండా సిరియా సంక్షోభంపై రాగమందుకుంటే జాగ్రత్తగా పరిశీలించండి. యుద్ధాలు, తుపాన్లు, ప్రకృతి బీభత్సాలు, ఎన్నికలు, అంతరిక్ష పరిశోధనలు ఇలా చాలా విస్తృతంగా ఉంటాయి వీరు పట్టించుకునే అంశాలు. వారికవి తగవని నిరుత్సాహపరచకుండా వీలైతే మరింత లోతుగా అవగాహన కల్పించాలి.

క్వశ్చన్ బ్యాంక్‌లైతే..

క్వశ్చన్లనే బుల్లెట్లను పటాకాల జడలా పేల్చిపడేసే గడుగ్గాయిలను చూసి గాబరా పడకూడదు. మీ దగ్గర సరైన జవాబులుంటే దాడిని ఎదుర్కోవాలి. లేకపోతే తెల్లజెండా ఊపకుండా

బలవంతం వద్దే వద్దు

ఈ మధ్య తెరపైకి వస్తున్న బాలమేధావుల్లో చాలా మంది పబ్లిగ్గా తమకా జీవితం నచ్చడం లేదని అంటున్నారు. అదే సామాజిక, వ్యక్తిగత సమస్య. ముందు నుంచి బలవంతమనేది ఒత్తిడిని అమాంతం పెంచేసరికి ఒక్కసారిగా స్తబ్ధత, నిస్సత్తువ ఆవరించి అమూల్యమైన మిగతా జీవితంలో దారుణమైన ఎదురుదెబ్బలు తింటారు. తీవ్ర డిప్రెషన్‌లోకి జారిపోయే ప్రమాదం ఉంది. ఎప్పుడో నలభైలు దాటాక వచ్చే మిడ్ లైఫ్ క్రైసిస్‌లాంటి సామాజిక, మానసిక రుగ్మతలు టీనేజీలోనే కనిపిస్తాయి. వాస్తవ జీవితానికి అంతరం ఎక్కువై భావోద్వేగాలు అదుపు తప్పే పరిస్థితిలోకి నెట్టబడతారు. ఆత్మహత్యల శాతం కూడా ఎక్కువే. ముప్ఫై ఏళ్ల వయసు తర్వాత వీరిలో కొందరు సామాజిక ఉపసంహరణ (సోషల్ విత్‌డ్రావల్) వంటి సమస్యలకు లోనవుతారు. వారి మీద ఏర్పడ్డ డిమాండ్ ప్రభావమే వారిని క్రమంగా నిస్సారం చేస్తుంది. కుంగుబాటు, బైపోలార్ సిండ్రోమ్ లాంటి లక్షణాలు అధికంగా కనిపిస్తాయి. తొలినాళ్లలో ఉన్న అత్యాసక్తి కాస్తా ఆ తర్వాత అబెసెషన్‌గా మారి ఓసీడీ (అబ్సెసివ్ కంపెల్సివ్ డిజార్డర్)కి ఓ రకంగా ప్రేరేపితమయ్యే అవకాశం ఉండొచ్చనే వాదనా వినిపిస్తోంది.

ఈక్యూ ముఖ్యం

పిల్లల వృద్ధిని కేవలం ఐక్యూతోనే కాకుండా ఈక్యూ (ఎమోషనల్ కోషంట్)తోను సరిచూడాలనేది మరికొందరు మనో నిపుణుల సలహా. ఇక్కడ బ్యాలెన్స్ తప్పితే ఎంత వేగంగా దూసుకుపోతారో అంతే వేగంగాను కుప్పకూలతారు. చాలా చిన్న వయసులోనే అద్భుత ప్రజ్ఞాపాటవాల్ని చూపిన నటులు, సంగీతకారులు, పెయింటర్లలో కొందరు నేరమయ, చీకటి జీవితాల్లోకి జారిపోయిన ఘటనలూ ఉన్నాయి. తల్లిదండ్రులు వారి ప్రత్యేకతలకు ప్రోత్సాహమిస్తూనే వారి జీవితం సమతుల్యం కోల్పోకుండా చూడాలి. అన్నింటి కంటే ముఖ్యంగా అతి నాజూకైన, విలువైన, అందమైన బాల్యాన్ని కోల్పోయే అవకాశాన్ని పెద్దలు చేతులారా కల్పించకూడదు. దేన్నైతే అదే లోకంగా పంజరం కడతారో అది ఎప్పటికీ పంజరంగానే మిగిలిపోతుందని, వారి బహుళ విస్తృతికి సంకెళ్లు వేస్తుందని గుర్తుంచుకోవాలి. విజయానికి కేవలం తెలివితేటలే సరిపోవు. ప్రజ్ఞాపాటవాలే పేరు తేవు. భావోద్వేగాలను నియంత్రించడంలో చురుకుదనం, శక్తి సామర్థ్యాలే సంఘంలో ఉనికిని ఏర్పాటు చేస్తాయి. ఇక్కడ అదుపు తప్పితే ఎంతటి ప్రజ్ఞ అయినా మసకబారుతుంది. తప్పుడు మార్గాలు పట్టిస్తుంది. ప్రవర్తన, తీరు, వ్యూహం, దృష్టి, అవగాహన వంటి ఎన్నో విషయాలను ఈక్యూ కొలుస్తుంది. ఓటమిని ఎదుర్కొనే నిబ్బరం, ధైర్యంగా ముందుకు నడవడం వంటి ఎన్నో విజయ రహస్యాలు చిలికేది మాత్రం ఎమోషనల్ ఇంటెలిజెన్సే.

ఆన్సర్ కనుక్కొని మరీ బదులివ్వాలి. సాధారణంగా పిల్లల బుర్రలో రోజుకు 20 ప్రశ్నలు తిరుగుతుంటాయి. కానీ ఈ క్వశ్చన్ బ్యాంకులు మాత్రం అన్‌లిమిటెడ్. మీ దగ్గర డేటా ఉన్నంత వరకు లాగేస్తారు. అందుకే ఎప్పటికప్పుడు కొత్త డేటాను అప్‌లోడ్ చేసి కొత్త విషయాలపై అప్‌గ్రేడ్ అవ్వాలి.

సెటైర్ పడుద్ది

బుడతలు కదా అని జోకర్ వేషాలేస్తే పెదాలు కొంచెం కూడా సాగవీ కేటగిరీకి. అదే పంచ్ డైలాగ్‌లకు మరో పంచ్ ఇచ్చి, వేరే వాళ్ల మీద వేసే సెటైర్లకు పొట్టలు చెక్కలయ్యేలా నవ్వుతారు. మరీ ఎక్కువైతే వాళ్ల నోటి నుంచే ఓ సెటైర్ పడుద్ది. మాటల్లోని తేడాలు ఇట్టే గుర్తుపట్టేస్తారు. పలుకుబడిలో ఓ పలుకు ఎక్కువే. సెన్సాఫ్ హ్యూమర్ వీళ్ల నుంచి నేర్చుకోవాలి.

కాసింత కళాపోషణ

సంగీత తృష్ణ, జ్ఞానంతో పాటు రసాస్వాదనా ఉంటుంది. పియానో, వయోలిన్, డ్రమ్‌స్టిక్స్, గిటార్ వంటి వాద్య పరికరాలపై ప్రేమలో పడిపోయే ఈ పిపాసులకు కాసింత కళాపోషణెక్కువే. చాలా మంది బాల మేధావులు ఆరి తేరేది ఈ విషయంలోనే. రిథమ్‌ను చాలా తేలిగ్గా పట్టేసి నిరాటంకంగా ప్రదర్శనలిచ్చే రేంజ్‌నీ తేలిగ్గా అందుకుంటారు.

ఆట వారిదే వేట వారిదే

పాత ఆటలకు కొత్త రూల్స్ పెట్టి గేమ్‌ను మరింత రసకందాయం చేసేస్తారు. లేదా రూల్స్ ఒప్పుకోని గేమ్స్‌ను కూడా బాక్స్ కట్టేసి కొత్త ఆటలు ఆడేస్తుంటారు. ఏం ఆడుతున్నారనే విషయంపైన కాకుండా ఎలా ఆడాలనే దానిపై కొత్త రూలింగ్‌లివ్వడం వీరి ఆనవాయితీ.

ఎత్తు కాదు లోతు

ఎంత ఎత్తు ఎదిగారా అని కాకుండా ఎంత లోతైనోళ్లే చూడాలి. వాళ్లకి నచ్చిన విషయంపై చాలా లోతైన జ్ఞానం సంపాదించేస్తారు. లోతైన విశ్లేషణ చేసేస్తారు. ఆయా అంశాలపై లోతైన ప్రేమలోను పడిపోతారు. వీళ్లకు బాగా డెప్త్ ఎక్కువ.

చూసేస్తారు.. చేసేస్తారు

వంటింట్లోకి దూరేస్తారు.. పాత్రలన్ని పోగేస్తారు. ఆఫీస్ ఫైల్ కనిపిస్తే పాపం కాగితాలన్ని కట్టేస్తారు. కంప్యూటర్ ఆపరేట్ చేస్తానంటారు. బండి నడుపుతానంటారు. సున్నం వేస్తానంటారు. మెహందీ పెడతానంటారు. ఇలా ఏది చూస్తే అది తాము చేసేస్తామని రెడీ అయిపోతారు. వీళ్ల దృష్టి మళ్లించి ఓ పనీ పూర్తిగా చేయడం దాదాపు అసాధ్యం.

ఈ ప్రత్యేకతలు ఇప్పుడున్న చాలామంది చిన్నారుల్లో చూస్తూనే ఉన్నాం అనుకుంటే ఓ మాట. కొందరు మానసిక శాస్త్రవేత్తల మాట కూడా అదే. ప్రతి చిన్నారి కూడా ప్రత్యేకమైనవారే. అందరూ గొప్ప మేధావులయ్యే అవకాశాలున్నాయి. కానీ అందరూ ఐన్‌స్టీన్‌లో, మొజార్ట్‌లో అయిపోవాలనే తల్లిదండ్రుల కాంక్షకు మాత్రం చాన్సే లేదు. పై అంశాల్లో ఏదో ఒకటో రెండో లేదా చాలావరకో ఓ బుడుగు ప్రదర్శిస్తుంటే దానర్థం వారికా విషయంలో అభిలాష ఉందని. వారిని అర్థం చేసుకుని వారి అభిరుచులకు అనుగుణంగా నడక నేర్పిస్తే పరుగు లంఘించడానికి పెద్ద దూరమేం పట్టదు. కొన్ని విషయాల్లో వారికి మీరు అడ్డు కూడా పడలేరు. మీరు వారించినా వారు ఎంచిన రంగాల్లోనే ఎలాగైనా ఎప్పటికైనా మేధావులవుతారు. వారి కానిదైతే ముందు బలవంతపు బాల మేధావుల్లా కనిపించినా ఆ తర్వాత అతి సాధారణం అవుతారు. లేదా చేజారతారు. పిల్లల్ని ఐన్‌స్టీన్ చేయొచ్చు, పికాసోగా మలచొచ్చు కానీ వాళ్లే మిస్సయిపోయే చాన్స్ మాత్రం తీసుకోకూడదు. బాల మేధావుల గురించి వచ్చే కథనాల్లో చాలా వరకు విషయాన్ని గ్లామరైజ్ చేస్తాయి. వారి ఏళ్ల శ్రమ, త్యాగం చేసుకున్న బాల్యం, చిరునవ్వుల్ని కాల్చేసే ఒత్తిడి గురించి ప్రస్తావన తక్కువ. స్వేచ్ఛగా, ఇష్టంగా సాగాల్సిన బాల్యంలో టార్గెట్లు, ప్రాజెక్టులు, సవాళ్లు, పరుగులు, విజయాలు, ఓటములు వంటి ఎన్నో అంశాలు ప్రభావితం చేస్తుంటాయి. గుర్తింపు అనే అంశమే వీటన్నింటినీ దగ్గరుండి నడిపిస్తుంది. అందుకే బాల మేధావి అనే గుర్తింపు కన్నా ఆ చిన్ని చేతులు చేసే అద్భుతాల్ని మనసారా ఆస్వాదించడం, ఆ చిట్టి బుర్రల పదునుకు మురిసిపోవడం వరకే తల్లిదండ్రులూ ఆగి మిగతా అడుగుల్ని వారి ఇష్టానికి వదిలేస్తే ఉత్తమం. ఎలాగు వారికి నచ్చిందే కాబట్టి బుద్ధి పుట్టినప్పుడల్లా మెరుపులు మెరిపిస్తారు. ఆ తర్వాత వద్దన్నా అందరూ రేసులో పరుగు లంఘించాల్సిందే. అక్కడ మాత్రం ఆలస్యం కాకుండా, వెనుకబడకుండా జాగ్రత్త తీసుకుంటే సరి. వాతావరణం అనుకూలిస్తే టపాసులు కచ్చితంగా పేలతాయి. ✦

రెండో సూరీడు

నార్వేలోని ర్యుకాన్, ఇటలీలోని విగనెల్లా కొండల్లో 'రెండో సూరీడు' ఉదయిస్తున్నాడు. సూరీడి కాంతి లేక అల్లాడిపోతున్న ఈ ఊళ్లలో వెలుగుల్ని నింపి కొత్త ఉషోదయాలతో 'గుడ్ మార్నింగ్' అని పలకరిస్తున్నాడు. నిలువద్దాలే ప్రేరణగా భారీ అద్దాల్ని కొండలకు బిగించి కాంతిని తమవైపు తిప్పుకుంటున్నాయా గ్రామాలు.

కొండ లోయల్లో ఎన్నో ఊళ్లు. అక్కడకు చేరే మలుపుల దారి పక్కన బెట్టండి. కొన్ని ప్రాంతాల్లో సూర్యుడికి కొండలు అడ్డుపడి అసలు వెలుతురే ఉండదు. కొండ శిఖరాల్ని తప్పించుకుని కొంచెం వెలుగు ప్రసరించినా అదీ మసకే. ర్యుకాన్, విగనెల్లా ఊళ్లదీ అదే సమస్య. అక్కడ ఆరునెలల పాటు సూర్యుడి జాడే కనిపించదు. చలికాలం వచ్చిందంటే గజగజలాడాల్సిందే. కరెంట్‌కు కోత పడిందంటే జనజీవనం స్తంభించాల్సిందే. అలాంటి చోట పట్ట పగళ్లైనా వెలుతురు లేకపోతే ఎలా. కొండల్ని అడ్డుతొలగించలేని పరిస్థితి. ఊరుని అక్కడి నుంచి మార్చేయలేరు. ఈ సమస్య నుంచి ఎలా బయటపడాలనే ప్రశ్నకు సమాధానంగా అద్దం కనిపించింది. దాని ద్వారా కాంతిని ఊరి వైపు పరావర్తనం చెందిస్తే బాగుంటుందనే ఆలోచన చేశారు. మరి ఊరంతటికీ సరిపడా వెలుగు కావాలంటే ఎంత పెద్ద పరిమాణంలో ఉండాలి. మాటి మాటికీ మారిపోయే సూర్యుడి స్థానానికి తగ్గట్టు ఎలా అద్దం దిశను మార్చాలి అనేది లెక్కలు కట్టారు. అలా తొలిసారిగా 2006లో విగనెల్లా కొండల్లో భారీ పరిమాణంలో ఉన్న అద్దాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ నవంబర్ మధ్య నుంచి ఫిబ్రవరి వరకు అసలు వెలుగే ఉండదు. ఆ కాలంలో దీని ద్వారా కాంతిని పొందుతున్నారు. ఆర్కిటెక్ట్, సన్ డయల్ డిజైనర్ అయిన గియాకొమో బొంజానీ దీని రూపకర్త. ఏకంగా నలభై చదరపు మీటర్ల పరిమాణంలో ఈ అద్దాన్ని రూపొందించారు. గ్రామం నుంచి 870 అడుగుల ఎత్తున దీన్ని కొండల్లో ఏర్పాటు చేశారు. సూర్యుడి గమనానికి అనుగుణంగా అది తన దిశను ఆటోమేటిక్‌గా మార్చుకునేలా ప్రత్యేకంగా కంప్యూటర్ వ్యవస్థను అనుసంధానించారు. అద్దంలోని ప్యానెల్స్ కాంతిని గ్రామం వైపు పరావర్తనం చెందించేలా పొజిషన్‌ను మార్చుకుంటాయి. ఈ సౌర అద్దాల ఆలోచన నిజానికి ఎమిలియో బార్లోకో అనే ఇంజినీర్‌ది. ఇది పనిచేస్తుందో లేదోనని ఊగిసలాటలో ఉన్న బృందాన్ని ఉత్తేజపరిచి సుమారు 80 లక్షల రూపాయలతో ప్రాజెక్ట్ ప్రారంభించేశాడు మేయర్. అది విజయవంతమవడంతో ఈ తరహా ప్రాజెక్ట్‌లకు మిగతా చోట్ల కూడా డిమాండ్ ఎక్కువైంది.



ఇవీ మరీ భారీవి..

ర్యుకాన్ ఓ పారిశ్రామిక కేంద్రం. అది టెలిమార్క్ కౌంటీలోని ఎత్తైన కొండల మధ్య నెలకొన్న ఊరు. సెప్టెంబర్ నుంచి మార్చి వరకు అక్కడ సూర్యకాంతి ప్రసరించదు. ప్రజలు చలి భరించలేక కేబుల్ కార్ల సాయంతో కొండ శిఖరాగ్రానికి చేరకుని చలికాచుకునే వారు. ఇప్పుడా పరిస్థితి మారిపోయింది. విగనెల్లాలో సౌర అద్దం ప్రాజెక్ట్ గురించి తెలుసుకున్న వాళ్లు కూడా తమ ఊరికి ఆ రకంగా సూర్యకాంతిని తేవాలని నిర్ణయించుకున్నారు. హెలికాప్టర్ల సాయంతో మూడు భారీ అద్దాల్ని (హీలియో స్టాట్స్)ను 450 అడుగుల ఎత్తున్న కొండల్లో బిగించారు. వాటిపై పరావర్తనం అయిన కాంతి నేరుగా ర్యుకాన్ మెయిన్ స్క్వేర్‌లో ప్రసరిస్తుంది. అయితే ఇదే ఆలోచన వందేళ్ల క్రితమే అక్కడి జలవిద్యుత్ ప్లాంట్ కార్మికుడు చేశాడు. మార్టిన్ ఆండర్సన్ అనే ఆ కార్మికుడు ప్రాజెక్ట్ కోసం భారీ స్థాయిలో నిధుల్ని కూడా సేకరించాడు. కానీ అది వాస్తవ రూపం దాల్చలేదు. నార్వేనియన్ ఇంజినీర్, పారిశ్రామికవేత్త అయిన సామ్ ఎయిడె దానికి తగ్గా సాంకేతికత లేదని ప్రాజెక్ట్ విరమించి దానికి బదులు కేబుల్ కారును ఏర్పాటు చేశాడు. ఎప్పుడైతే విగనెల్లాలో సాధ్యమైందో వెంటనే అక్క డకు ఓ అధ్యయన బృందాన్ని పంపి సాంకేతి కతను పరిశీలించి 5 ఏళ్ల పాటు మరిన్ని పరిశోధ నలు చేసి విగనెల్లా అద్దాని కన్నా భారీ స్థాయిలో మూడు అద్దాల్ని ఏర్పాటు చేశారు. వీటి మొత్తం పరిమాణం 600 చదరపు మీటర్లు. వీటికి కంప్యూటర్ సాయంతోనే దిశను మార్చుకునే సాంకేతికతను అభివృద్ధి చేశారు. యంత్రాలు, పరికరాలు, వ్యవస్థ పనిచేసేందుకు కావాల్సిన విద్యుత్తును అద్దాల వద్ద ఉత్పత్తి అయ్యే ఉష్ణాన్నే వాడారు. ఓ రకంగా సౌర ఫలకంగాను పని చేస్తాయవి. ఊరి వాళ్ల ఆరోగ్యం, సామాజిక జీవనం మెరుగయ్యాయి. పర్యాటక కేంద్రాలుగాను అవి క్రమంగా గుర్తింపు తెచ్చుకున్నాయి. కేవలం ఈ అద్దాల వింతను చూసేందుకే అక్కడకు చలికాలంలో వచ్చే సందర్శకుల తాకిడిఎక్కువైంది.

నవ్వుల్ – పువ్వుల్

బరువు

భూమి గురించి పాఠం చెప్పాక ఓ కొంటె విద్యార్థి లేచి "సార్! భూమి ఎంత బరువు వుంటుంది?" అనడిగాడు అనునయంగా.

టీచర్ జవాబు తెలీక ఉక్కిరి బిక్కిరవుతుండగా బెల్ మోగింది.

"రేపు చెప్తాలే" అని ఆ రాత్రి లైబ్రరీలోని పుస్తకాలన్నీ తిరగేసి మర్నాడు గర్వంగా క్లాసుకొచ్చాడు.

ఆ కుర్రాడిని నిలబెట్టి భూమి బరువెంతో చెప్పాడతనికి.

"ఆ బరువు మనుషుల బరువు కలుపుకునా, లేకుండానా?" మళ్ళీ అడిగాడు కుర్రాడు.

ఇక మాష్టారిని చూడాలి!

మేటర్!

కోదండం: ఏంట్రా ఉత్తరం మీద ఉత్తి అడ్రస్సు రాసి మేటర్ ఏమీ రాయకుండా పోస్ట్ చేస్తున్నావ్!?

మూర్తి: వాడికి నాకు మాటల్లేవు... ఇక మేటరేముంటుంది?

ప్రమోషన్

జడ్జి (పరిచయస్తుడితో): ఓ... మీరా! నేను వకీలుగా ఉండగా సైకిలు దొంగిలించి వచ్చారు. నేను పబ్లిక్ ప్రాసిక్యూటర్నైనపుడు మోటరు సైకిల్ దొంగలించారు. ఇప్పుడు జడ్జి అయినపుడు కారు దొంగలించారు. చాలా విచిత్రంగా ఉందే!

అపరాధి: ఏం లేదు సార్! నాకు కూడా ప్రమోషన్ వచ్చిందంతే సార్!

సినిమా చూడలేదా!

సినిమాకు వెళ్ళావు. సినిమా ఎలా ఉంది అని అడిగితే చూడలేదంటావేం? కోపంగా అడిగింది సువర్ణ.

"నా పక్కన కూర్చున్నావిడ పెట్టుకొచ్చిన రవ్వల దుద్దులు అంత చీకట్లోనూ ధగధగ మెరుస్తుంటే సినిమా ఎలా చూడగలను చెప్పు..?" అంది స్వర్ణ

పువ్వుల్లో...

భార్య: ఏమండి....!!! పక్కింటాయన వాళ్ళ ఆవిడను పూవుల్లో పెట్టుకుని చూసుకుంటున్నాడంటా..

భర్త: ఆయనది పువ్వుల వ్యాపారం, నాది కారప్పొడి వ్యాపారం...

సిమ్ కార్డు

"నేను సెల్‌ఫోన్ అయితే నీవు సిమ్‌కార్డువు" చెప్పింది ప్రేయసి.

"యురేకా... అంటూ కేకేసి ప్రేయసిని కౌగిలించుకోబోయాడు ప్రియుడు.

ఓవర్ యాక్షన్ చేస్తే సిమ్ కార్డు మార్చేస్తా" వార్నింగ్ ఇచ్చింది ప్రేయసి.

ఏ సినిమా

డాక్టర్: ఆపరేషన్ చేసేందుకు పేషెంట్‌ను పక్కనున్న థియేటర్‌లోకి మార్చండి (కొత్తగా వచ్చిన నర్స్‌తో)

నర్స్: అలాగే సర్. మరి పక్క థియేటర్‌లో ఏ సినిమా ఆడుతుంది. ఉత్సాహంగా అడిగింది నర్స్.

సైట్లన్నీ వెతికి, ఫీచర్ల గురించి కనుక్కుని ఎంతో ఇష్టంగా కొన్న ఖరీదైన ఫోన్ ఎక్కడో పోతే...? బాధపడుతూ కూర్చోవాల్సిన పని లేదు. ఏ స్థలంలో మరిచిపోయారో, ప్రస్తుతం ఆ ఫోన్ ఎక్కడుందో క్షణాల్లో తెలుసుకోవచ్చు. ఎవరి చేతుల్లో ఉందో వారి ఫోటోలు కూడా సంపాదించొచ్చు. మర్యాదగా ఫోన్ తెచ్చి అప్పగిస్తావా లేక నీ ఫోటో పోలీసులకు ఇవ్వమంటావా అని మెసేజ్ పెట్టొచ్చు. మీది ఆండ్రాయిడ్ ఫోన్ అయితే అది సాధ్యమే. ఎలాగో చదవండి.

ఫోన్ పోయిందా? పట్టుకోండిలా...!

- పి.సురేంద్ర కుమార్

మాదాపూర్‌లో ఉండే శీను ఇటీవలే కొత్త స్మార్ట్‌ఫోన్ కొన్నాడు. ఆకట్టుకునే లుక్, అద్భుతమైన ఫీచర్స్ ఉన్న ఆ ఫోన్ చూసిన స్నేహితులు సైతం సూపర్ ఫోన్ అన్నారు. ఆండ్రాయిడ్ లాలిపాప్‌తో వచ్చిన ఆ ఫోన్ శీనుకి తెగ నచ్చేసింది. కానీ అది మూన్నాళ్ల ముచ్చటే అయింది. సెలవు రోజున సూపర్‌మార్కెట్‌కు వెళ్లిన రవి ఫోన్ ఎక్కడో పోగొట్టుకున్నాడు. ఆ రోజు విపరీతమైన జనం. ఫోన్ ఎవరికి దొరికిందో తెలియదు. వెంటనే ఫోన్ చేస్తే స్విచాఫ్ అని వచ్చింది. దాంతో శీను దిగాలుపడిపోయాడు. ఎంతో ఇష్టపడి కొన్న ఫోన్ నెల రోజులు కాకముందే పోవడంతో బాగా బాధపడ్డాడు.

శీను స్మార్ట్‌ఫోన్ అయితే కొన్నాడు కానీ, యాంటీ థెఫ్ట్ యాప్స్ మాత్రం ఇన్‌స్టాల్ చేసుకోలేదు. దానివల్ల ఖరీదైన ఫోన్ ఎక్కడ పోయిందో కనుక్కోలేకపోయాడు. ఒకవేళ తను యాంటీథెఫ్ట్ యాప్స్ ఇన్‌స్టాల్ చేసుకుని ఉంటే తన ఫోన్ సులభంగా దొరికేది. ఫోన్ పోతే వెతికిపెట్టే యాప్స్ ఇప్పుడు చాలానే ఉన్నాయి.

వేర్ అవేర్

ఫోన్ ఎక్కడ పడితే అక్కడ పెట్టి మరిచిపోతుంటారా? అయితే ఈ వాచ్ మీరు ధరించాల్సిందే. ఈ వాచ్ ఉంటే ఫోన్ మరిచిపోయే ప్రసక్తే ఉండదు. ఫోన్ మీ వెంట లేకపోతే ఈ ఆండ్రాయిడ్ వేర్ వాచ్ మిమ్మల్ని హెచ్చరిస్తుంది. వాచ్, స్మార్ట్‌ఫోన్‌కు మధ్య సిగ్నల్స్ అనుసంధానం అవుతుంటాయి. ఒకవేళ ఈ రెండింటి మధ్య సిగ్నల్స్ లేకపోతే వైబ్రేషన్స్‌తో హెచ్చరిస్తుంది. సింపుల్‌గా ఉంటుంది. ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది.

గాట్‌యా!

మీ డివైజ్‌కు పర్‌ఫెక్ట్ సెక్యూరిటీ కావాలంటే ఈ యాప్‌ని ఎంచుకోవచ్చు. ఒకవేళ మీ ఫోన్‌ను ఎవరైనా తస్కరించి స్క్రీన్ లాక్‌ని తప్పుగా ఎంటర్ చేసినట్లయితే ఫ్రంట్ ఫేసింగ్ కెమెరాతో వారి ఫోటోలను సైలెంట్‌గా తీసి మీ రిజిస్టర్డ్ మెయిల్‌కు పంపిస్తుంది. ఫోన్ ఏ లొకేషన్‌లో ఉందో గూగుల్ మ్యాప్‌లో చూపిస్తుంది. ఆ లింక్‌ను మెయిల్ చేస్తుంది. ఫోన్ మీరున్న ప్రదేశానికి దగ్గరలోనే ఉందని తెలిస్తే సైలెంట్‌లో ఉన్నా బిగ్గరగా అలారం సౌండ్ వచ్చేలా చేయవచ్చు. దీంతో ఫోన్ ఎక్కడుందో తెలిసిపోతుంది. డివైజ్ లాక్/అన్ లాక్, కాల్ బ్యాక్ రిక్వెస్ట్, సిమ్ చేంజ్ నోటిఫికేషన్, మెసేజ్ డిస్‌ప్లే వంటి ఫీచర్లు అదనం.

లుకవుట్‌జి

ఇది అద్భుతమైన యాప్. ఫోన్‌ను ట్రాక్ చేయ డానికి బాగా ఉప కరిస్తుంది. చేయా ల్సిం దల్లా యాప్‌ని ఇన్‌స్టాల్ చేసుకోవడమే. కాం టాక్ట్స్, ఫోటోలు బ్యాకప్ పెట్టుకోవచ్చు. ఒకవేళ ఫోన్ పోయినట్లయితే మరొక స్మార్ట్‌ఫోన్ లేదా కంప్యూటర్‌లో నుంచి లుక్అవుట్ అకౌంట్‌లోకి లాగిన్ అయి మిస్‌ప్లేస్ అయిన ఫోన్‌ను ట్రాక్ చేయవచ్చు. ఈ యాప్‌లో కొన్ని ముఖ్యమైన ఫంక్షన్స్ ఉన్నాయి. అవి లొకేట్, స్క్రీమ్, సిగ్నల్ ఫ్లేర్, లాక్ కామ్. లుక్అవుట్ అకౌంట్‌లోకి యూజర్ లాగిన్ అయిన తరువాత ఈ ఆప్షన్‌ను యాక్టివేట్ చేయవచ్చు. వెంటనే ఫోన్‌ను ట్రాక్ చేసి అది ఉన్న ప్రదేశాన్ని గూగుల్ మ్యాప్‌లో చూపిస్తుంది. పోగొట్టుకున్న డివైజ్ ఏ లొకేషన్‌లో ఉందో తెలియజేస్తూ మెయిల్ కూడా వస్తుంది. మొబైల్ ఎక్కడ ఉందో తెలియజేసేందుకు స్క్రీమ్ ఫీచర్ పెద్దగా అలారం సౌండ్ చేస్తుంది. ఒకవేళ ఫోన్ బ్యాటరీ పూర్తిగా డౌన్ అయిపోతే కనుక్కోవడం కష్టంగా మారుతుంది. ఆ సమయంలో సిగ్నల్ ఫ్లేర్ ఫీచర్ ఉపయోగపడుతుంది. బ్యాటరీ డెడ్ అవుతున్నట్లయితే లుక్ అవుట్ అప్లికేషన్ ఆటోమెటిక్‌గా చివరగా ట్రేస్ చేసిన లొకేషన్‌ను అకౌంట్‌లో సేవ్ చేస్తుంది. ఫోన్‌ను అన్‌లాక్ చేసేందుకు ప్రయత్నించి, మూడు సార్లు విఫలమైతే స్మార్ట్‌ఫోన్‌లో ఉన్న కెమెరా ఆటోమెటిక్‌గా ఫోటోలను తీస్తుంది. రిజిస్టర్ చేసుకున్న ఐడీకి మెయిల్ పంపిస్తుంది. ఇందుకోసం లాక్ కామ్ ఫీచర్ ఉపయోగపడుతుంది. మొత్తంగా లుకవుట్ ఉంటే మొబైల్ భద్రంగా ఉన్నట్లే. ఖరీదైన ఫోన్ కొనగానే సరిపోదు. అవసరమైన యాప్స్ ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అప్పుడే ఫోన్‌కు, అందులోని డాటాకు భద్రత లభిస్తుంది. ఈ యాంటీ థెఫ్ట్ యాప్స్ ఉంటే నిశ్చింతగా ఉండొచ్చనడంలో సందేహం లేదు కదూ.

ఆండ్రాయిడ్ డివైజ్ మేనేజర్

గూగుల్ అందిస్తున్న యాప్ ఇది. లాస్ట్ ఫోన్‌ను లొకేట్ చేయడానికి ఉపయో గపడు తుంది. అంతే కాకుండా డివైజ్‌లో ఉన్న డాటా ఇతరుల చేతుల్లో పడకుండా కాపాడుకోవచ్చు. గూగుల్ అకౌంట్ సహాయంతో ఆండ్రాయిడ్ డివైజ్‌ను లొకేట్ చేయవచ్చు. స్క్రీన్ లాక్ పిన్‌ను రీసెట్ చేసుకోవచ్చు. కావాలంటే డాటా మొత్తం తుడిచేయవచ్చు.

ఫైండ్ మై ఆండ్రాయిడ్ ఫోన్

ఫోన్ లొకేషన్ రియల్ టైమ్ అప్‌డేట్‌ని అందిస్తుంది. ఫోన్ ఉన్న వ్యక్తి ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి మారుతున్నట్లయితే వెంటనే చూపిస్తుంది. దీంతో పోయిన ఫోన్‌ను గుర్తించడం ఈజీ అవుతుంది. ఫైండ్ మై ఆండ్రాయిడ్ ఫోన్ వెబ్‌సైట్ ఇన్‌స్టంట్‌గా లొకేషన్ అప్‌డేట్‌ని పొందవచ్చు.

యాంటీ థెఫ్ట్ అలారం

టూర్స్‌కు వెళ్లినపుడు, ప్రయాణాల్లోనూ సౌలభ్యాన్ని బట్టి చార్జింగ్ పెట్టాల్సి వస్తుంది. ఆ సమయంలో ఫోన్‌ను కనిపెట్టుకుని ఉండాల్సి వస్తుంది. అలాకాకుండా మొబైల్‌లో యాంటీ థెఫ్ట్ అలారం ఇన్‌స్టాల్ చేసి ఆన్ చేసినట్లయితే ఎవరైనా ఫోన్ చార్జింగ్ నుంచి తీస్తే పెద్ద శబ్దం చేస్తుంది. అంతేకాకుండా ఫోన్ లాక్ అవుతుంది. అలారం శబ్దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఫోన్‌ను తస్కరించిన వ్యక్తి ఆపలేడు. పిన్ ఎంటర్ చేయడం ద్వారా మీరు మాత్రమే ఆపగలుగుతారు. ఫోన్‌ను ఎవరైనా తీస్తారేమోననే భయం ఉండదు.

ప్రే యాంటీ థెఫ్ట్

జియోలొకేషన్ ఫీచర్‌తో పోయిన ఫోన్ ఎక్కడుందో తెలుసుకోవచ్చు. జీపీఎస్, వైఫై ట్రయాంగులేషన్‌తో ఫోన్ ఎక్కడుందో మ్యాప్‌లో గుర్తించవచ్చు. గాట్‌యా మాదిరిగానే ఇందులోనూ ఫోటో ట్రిక్ ఉపకరిస్తుంది. ఫ్రంట్ ఫేసింగ్ కెమెరా, రేర్ కెమెరాతో రిమోట్‌గా ఫోటోలు తీసి పొందవచ్చు. ఇతరులు ఓపెన్ చేయకుండా రిమోట్‌గా లాక్ చేయవచ్చు.

అవాస్ట్

ఇందులోనూ దాదాపుగా అవే ఫీచర్స్ ఉంటాయి. రిమోట్‌గా డాటాను తొలగించుకోవచ్చు. ఫోన్ ఎవరి చేతుల్లో ఉందో వారి ఫోటోలు తీసుకోవచ్చు. ఆ చుట్టుపక్కల వాయిస్‌ని వినొచ్చు. జీపీఎస్ సహాయంతో ఏ ప్రదేశంలో ఉన్నారో లొకేట్ చేయొచ్చు. టెక్స్ట్ మెసేజ్ పంపించి ఫోన్ లాక్ అయ్యేలా చేసుకోవచ్చు.

కళ్లు మాట్లాడతాయి. పోట్లాడతాయి. ప్రేమను కుమ్మరిస్తాయి. నిప్పులూ చెరుగుతాయి. అవే 'కళ్లు' చిదంబరం సినీ జీవిత నావకు చుక్కానిలా వ్యవహరించాయి. మూడున్నర దశాబ్దాలు వైవిధ్యభరిత పాత్రల ద్వారా తెలుగు సినిమా ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించిన హాస్య నటుడు కళ్లు చిదంబరం గత నెల 19న విశాఖలో తుది శ్వాస విడిచారు.

రెప్పవాల్చని 'కళ్లు'

అప్పటికే చాలా రోజులు ఆస్పత్రిలో వెంటిలేటర్ మీద ఉండి మృత్యువుతో పోరాడుతున్నారు. చిదంబరంగారబ్బాయి రామకృష్ణ వాళ్ల నాన్న ఫోన్‌లో ఉన్న ముఖ్యుల కాంటాక్ట్ నంబర్లతో తరచూ టచ్‌లో ఉండేవాళ్లలో నేనూ ఒకడ్ని. ఆ రోజు ఉదయం సుమారు పదిన్నరయ్యింది. పావుగంట క్రితమే..... (మౌనం) డాక్టర్ డిక్లేర్ చేశారని ఏడుస్తూ రామకృష్ణ ఫోన్. విషయం నాకర్థమయ్యింది. ఉన్నపళంగా కేర్ ఆస్పత్రికి వెళ్లాను. అభిమానులు, మీడియా మిత్రులు అక్కడ గుమిగూడి ఉన్నారు. నీళ్లుబికిన కళ్లతో బాదంగీర్ సాయి నన్నాలింగనం చేసుకుని బావురుమన్నాడు. 'కళ్లలోనుంచే ప్రాణం పోయింది' ఫ్రీజర్ బాక్స్‌లో కళ్లు, నోరు తెరుచుకున్న చిదంబరం పార్థీవ దేహాన్ని చూసి నా పక్కనున్న ఒకాయన అన్నాడు. అప్పుడు మళ్లీ తీక్షణంగా ఆ ముఖాన్ని చూశాను. ప్రాణమైతే అనంత వాయువుల్లో కలసిపోయింది. కానీ ఆయన కనుమూయలేదు. ఔను... ఇంకా ఎవరెవర్నో చూడాలన్న తపనతో రెప్పవాల్చని కళ్లు, ఏదో చెప్పాలని తెరుచుకున్న నోరు తెరుచుకొనున్నాయి. కొందరు ఆ విషయాన్నే చర్చించారు.

చలనచిత్ర జీవితంలో 'కళ్లు' చిదంబరం హాస్యనటుడు. కానీ నిజ జీవితంలో ఓ సీరియస్ కళాసేవకుడు. తాను ఆర్టిస్ట్‌గా కంటే ఆర్ట్ లవర్‌గా, టాలెంట్‌ని వెలికితీసే ఈవెంట్ మేనేజర్‌గా ప్రూవ్ చేసుకోడానికి అన్నీ తానై ఎక్కువ సమయాన్ని కేటాయించేవారు. వెండి తెరమీద ఉత్తరాంధ్ర మాండలికాన్ని తన కేరాఫ్ ఎడ్రస్‌గా చేసుకున్నప్పటికీ.. నిజ జీవిత సంభాషణల్లో ఆయన మాటతీరు వేరని బైట ప్రపంచానికి తక్కువ తెలుసు. ఆయనది సూది ముక్కు. మొహమ్మీద కుండ బద్దలుగొట్టినట్టుండే మాటతీరు. అన్నట్టు.. ఆ మాట సూదిలా గుచ్చుతుంది. ఎవరికైనా ఫోన్ చెయ్యగానే 'నేను కళ్లు చిదంబరాన్ని' మాట్లాడుతున్నాను అని సెల్ఫ్ ఇంట్రడక్షన్ ఇచ్చుకుని సంభాషించడం ఆయనకుండే మంచి అలవాటు. ఫ్రీలాన్స్ జర్నలిస్ట్‌గా, కల్చరల్ కాలమిస్టుగా 'వార్త' దినపత్రికలో తలమునకలై ఉండగా 1997 మార్చి నెలలో అనుకుంటా కళ్లు చిదంబరంతో నాకు పరిచయం ఏర్పడింది. ఒకరోజు వార్త ఆఫీస్ బ్యూరో చీఫ్‌కి ఫోన్ వచ్చింది. ఫలానా కార్యక్రమంలో ప్రసంగించినవారిలో నేనూ ఒకణ్ణి కానీ మీ కల్చరల్ జర్నలిస్ట్ నా ప్రసంగం రాయకుండా పాల్గొన్నారు అని పేరొక్కటే రాశాడని చిదంబరం ఆరోపణ. ఆ పితూరీకి సంజాయిషీ చెప్పమంటూ బ్యూరో చీఫ్ రమణ మూర్తి నన్ను లైన్లోనికి పిలిచారు. సమయాభావం, స్థలాభావం వల్ల ఆఖరి స్పీచ్ వరకూ అందరి మాటలూ రాయడం సాధ్యం కాదు కాబట్టి కట్ షాట్‌గా ఇవ్వాల్సి వచ్చిందని ఎంత చెప్పినా ఠార్..! నా గోడు వినిపించుకోడే. అలా మేమిద్దరం 'మిత్ర శత్రువు'లయ్యాం. పోర్టులో ఉద్యోగం చేసే ఆయన సన్నిహితుల ద్వారా నాకు తర్వాత్తర్వాత బోధపడిన విషయమేంటంటే తిట్టడం, తిట్లు కాయడం, అడిగెయ్యడం, కడిగెయ్యడం స్వతహాగా ఆయన స్వభావమని. బహుశా ఈ ప్రవర్తన వల్ల ఆయనలో నిబిడీకృతమై ఉన్న అసలు సిసలు కళాకారుణ్ణి సినీ పరిశ్రమ ఉపయోగించు కోలేకపోయిందేమోనని నా అనుమానం. ఒక దశలో విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ కళాకారులు తెలుగు నేల నలుచెరగులా

గుండు హనుమంతరావు, కాదంబరి కిరణ్‌తో...

కొండవలసతో...

సాంస్కృతిక రంగాన్ని శాసించారని చెప్పడం అతిశయోక్తి కాదేమో. పోర్టు, దాని అనుబంధ సంస్థల్లో కళలకు ప్రోత్సాహం, కళాకారులకు గౌరవం లభించేవి. సాగరి అనే పేరుతో పోర్టు కల్చరల్ అసోసియేషన్ ఇన్ హౌస్ మేగజీన్ ప్రచురించేది. వృత్తిరీత్యా విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ ఔటర్ హార్బర్‌లో 1970 నుంచి అసిస్టెంట్ ఇంజనీర్ కావడం వల్ల 'సాగరి'లో తన డిపార్టుమెంటు కల్చరల్ సెక్రెటరీగా సేవలందించే అవకాశం 1977 నుంచి చిదంబరాన్ని వరించింది.

తన సొంతూరు విజయనగరం హైస్కూల్లో ఏడోతరగతి చదివే రోజుల్లో చిదంబరం ముఖానికి రంగేసుకుని రంగస్థల నటుడుయ్యారు. నటుడిగా, నిర్వాహకుడిగా కొన్ని దశాబ్దాలు మొక్కవోని దీక్షతో పనిచేసినా రాని గుర్తింపు, గౌరవం గొల్లపూడి మారుతీరావు రచించిన 'కళ్లు' సిన్మాలో నటించాక ఆయనకు వచ్చాయి. 1987 డిసెంబర్‌లో సినిమాటోగ్రాఫర్ ఎంవీ రఘు దర్శకుడిగా మారి ఇచ్చిన అవకాశం ఆయన జీవితాన్ని మలుపు తిప్పింది. ఆ సిన్మా అసిస్టెంట్ డైరెక్టర్ 'లంక సత్యానంద్' ప్రోద్బలం వల్ల అయిష్టంగానే సినిమా రంగప్రవేశం చేశానని చిదంబరం చెప్పేవారు. ఆ సిన్మాలో ఆయనకు స్పెషల్ జ్యూరీ అవార్డు. అప్పటి ముఖ్య మంత్రి ఎన్టీ రామారావు చేతుల మీదుగా బహుమతి. ఇంకేముంది? సహజంగా సినిమా రంగమ్మీద ఆయన కన్ను పడింది. ఎలాంటి గాడ్ ఫాదర్ లేకుండా సిన్మా అవకాశం దానంతట అదే రావడం సింగిల్ సీన్ ఆర్టిస్టుగానైనా గుర్తింపు ఉన్న పాత్రల్లో 300 చిత్రాలు నటించడం చిదంబర రహస్యమే.

ఇంకో ముఖ్యమైన విషయమేంటంటే మద్రాసు నుంచి తెలుగు చిత్ర పరిశ్రమ హైదరాబాదుకు తరలినప్పుడు హైదరాబాద్‌లో నివాసం ఉండేవారికే అవకాశాలు అని మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా) విధించిన షరతుల్లో కూడా విశాఖలోనే మకాం ఉండి సిన్మాల్లో నటించారు. తిరిగే కాలు, తిట్టే నోరు కుదురుండవని పెద్దలంటారు. సినిమా అవకాశాలు

'కళ్లు' చిత్రంలో చిదంబరం

తనకు అందనంత ఎత్తుకు ఎదిగిపోయాయని గ్రహించాక 2008వ సంవత్సరం చివర్లో కళ్లు చిదంబరం విశాఖ కళారంగం మీద దృష్టిపెట్టారు. అప్పటికే అన్నిరంగాల కళాకారుల్ని ఏకతాటిమీదికి తేవాలని పనిచేస్తున్న బాదంగీర్ సాయి (ఏవీవీఎస్ మూర్తి) భావసారూప్యత చిదంబరానికి తోడయ్యింది. కల్సి పనిచేద్దాం. అద్భుతాలు సాధిద్దాం అనుకున్నారు. వీరిద్దరి సంకల్ప బలంతో కళారూపాలు వేరైనా కళాకారులంతా ఒక్కటే అనే సందేశంతో సుమారు1200 మంది సభ్యులతో 'సకల కళాకారుల సమాఖ్య' (సకస)ఏర్పడింది. పద్మశ్రీ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, డాక్టర్ సూరపనేని విజయ కుమార్, మళ్ల విజయ ప్రసాద్ వంటి ప్రముఖులను సంస్థకు గౌరవాధ్యక్షులుగా, సలహా సంఘంగా ఏర్పాటు చేయడంలో ఆయన ముఖ్య భూమిక వహించారు. అలా 'సకస' ద్వారా హైదరాబాద్‌లోని రవీంద్రభారతి తరహాలో విశాఖ నగరం నడిబొడ్డున అన్ని వసతులతో కూడిన అత్యాధునిక ఆడిటోరియం నిర్మాణానికి ప్రభుత్వ పెద్దలను ఒప్పించే ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. సకస సభ్యత్వం పొందిన కళాకారులకు గుర్తింపు కార్డులిచ్చి నిరుపేద కళాకారులకు ఇళ్ల మంజూరు, విద్య, వైద్యం వంటి రంగాల్లో కొన్ని రాయితీలు, ప్రతిభను ప్రోత్సహించే పారితోషికాలు, మృతి చెందిన పేద కళాకారుల అంత్య క్రియలకు తక్షణ సహాయంగా 2000 రూపాయల నగదు వంటి మంచి పథకాలు ఈ సంస్థ ద్వారా ప్రవేశపెట్టడం జరిగింది. ఒకపక్క సంక్షేమ కార్యక్రమాలు మరోపక్క 'సకల కళావైభవం' అనే పేరుతో నెలవారీ సాంస్కృతిక ప్రదర్శనతో కళాకారుల్లో నూతన ఉత్తేజం నింపే ప్రయత్నం జరిగింది.

అసలే బక్కపల్చని మనిషి. పైగా చైన్ స్మోకింగ్. సమయానికి తిండి తినకపోవడం వంటి అలవాట్లు ఆయన ఆరోగ్యాన్ని కుంగదీశాయి. అయినా తాననుకున్నది తప్ప ఎవరి మాటా వినేవారు కాదు. ఊపిరితిత్తులు వార్నింగ్ సైన్ ఇచ్చాయి. లైఫ్ స్టైల్ మార్చుకోండి మొర్రో అని డాక్టర్లు చెవినిల్లుకట్టుకొని చెప్పారు. ఐనా ససేమిరా. శ్వాసకోశ వ్యాధి ముదిరింది. ఊపిరితిత్తుల పనితనం సన్నగిల్లి ప్రాణవాయువు అందకపోవడం వల్ల ఆక్సిజన్ ఎక్విప్‌మెంట్ వాడకం అనివార్యమైపోయింది. 'నాజల్ ప్రాంక్స్' పెట్టుకుని తన కార్లో ఆక్సిజన్ ఎక్విప్‌మెంట్‌తో సహా కళా ప్రదర్శనల్లో దర్శనమిచ్చేవారు. గత రెండేళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ చిదంబరం కళారంగాన్ని, చిదంబరాన్ని కళారంగం పరస్పరం వదిలిపెట్టలేదు. తుది శ్వాస వరకూ కళ కోసమే తపించారనడానికి మచ్చుతనకగా అక్టోబర్ 8వ తేదీన కళాభారతి ఆడిటోరియంలో 'గురు రాఘవేంద్ర చరిత్ర' నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు. అప్పటికి ఆయన ఆస్పత్రిలో ఇంటెన్సివ్ కేర్‌లో ఉన్నారు. అక్కడి నుంచే ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆస్పత్రి నిర్బంధ స్థితిలోనూ ఆయన కార్యదక్షత ఆగలేదు. బంధు మిత్రులు సైనికుల్లా పనిచేశారు. తప్పదు. ఎందుకంటే తన దారికి అడ్డొచ్చిన వాళ్లమీద చిదంబరం చిరుబురులాడతారు. మరణ శయ్యమీద ఉండి కూడా నాటక ప్రదర్శనకోసం కొట్టుమిట్టాడిన ఆయన స్ఫూర్తి కళాప్రియుల్ని కలచివేసింది. విషయం తెలిశాక మిత్రుడూ లేడు, శత్రువూ లేడు. మిత్రశత్రువులంతకంటే లేరు కళాకారులంతా ఆయన్ని ఆస్పత్రిలో పరామర్శించారు. ఆయనలోనూ పశ్చాత్తాపం పొంగుకొచ్చింది. నోరు విప్పి మాట్లాడలేని పరిస్థితిలోనూ కళ్లతో మాట్లాడేవారు. జీవిత చరమాంకంలో మృత్యువుతో పోరాడుతున్న చిదంబరాన్ని మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ బొత్తిగా పట్టించుకోలేదని విమర్శలొచ్చాయి. వెండి తెరమీద ఉత్తరాంధ్ర మాండలికాన్ని తారాపథంలోకి తీసుకెళ్లిన కళ్లు చిదంబరం శ్వాస ఆగిపోయింది. కనీసం ఆయన ఆశ(యం) నెరవేర్చడానికి ప్రభుత్వం పూనుకొని ఆడిటోరియం అయినా నిర్మిస్తుందేమో? వేచి చూడాలి!

బందిలి రతన్ రాజు

ఫోన్: 9490263115

టాటూ హిట్టే

మణికట్టుపై ఓ గీతో, మెడ మీద రాతో ఏదైతేనే ... టాటూ ఎప్పటి ఆర్టో. ఇపుడు ఫ్యాషన్ లోకాన్ని ఊపేస్తోంది. ఈ టాటూల ప్రపంచాన్ని కళ్లకు కట్టేస్తాయి కన్వెన్షన్లు. ఇటీవలే చైనా అంతర్జాతీయ టాటూ కన్వెన్షన్ గువాంక్సీలోని నాన్నింగ్‌లో భారీ స్థాయిలో జరిగింది. ఫ్రాన్స్, జర్మనీ, అమెరికా, డెన్మార్క్, కొలంబియా వంటి పదుల దేశాల నుంచి వచ్చిన 120 మంది టాటూ స్టార్లు తమ పెన్నుకు పని చెప్పారు. ఈ దఫా అమ్మాయిలదే పైచేయి. ఫొటోగ్రాఫర్ల కెమెరా కళ్లు కూడా వారిపైనే వాలిపోయాయి. ఇంకేముంది టాటూ ఎంబ్రాయిడరీగా ఈవెంట్‌ను పిలుచుకున్న ఈ షో పేరుకు తగ్గట్టు వన్నెల్ని అల్లేసుకుంది. జడ్జులు, డాక్టర్లు, కుటుంబరావులు సైతం సెషన్లకు హాజరై పచ్చబొట్టు అంటించుకున్నారు. మన దేశంలోను కన్వెన్షన్లకు అపుడే ఇంక్ బుడ్డీల్ని నింపేస్తున్నారు.

పొదరిల్లు – పొదుపు నిచ్చెన

ఇంటి అద్దెలు మనల్నే కాదు. లండన్ వాసులనూ భయపెడుతున్నాయి. క్రిస్టియన్ మాంటెజ్, కైరా పోవెల్ జంట ఈ అద్దెలతో విసిగిపోయింది. నెల తిరిగేసరికి వందల పౌండ్లు అద్దెలు కట్టుకుంటూ పోతే ఇక సొంత ఇల్లు ఇప్పట్లో అమరదని వారికి అర్థమైపోయింది. దాంతో ఇద్దరూ కలిసి చక్కటి ఆలోచన చేశారు. ఉపయోగించకుండా పక్కన పడేసిన వస్తువులతో చక్కటి పొదరిల్లు కట్టుకోవాలనుకున్నారు. అందుకు బంధువులు, స్నేహితుల సాయం తీసుకున్నారు. వారి ఇళ్లలో నిరుపయోగంగా పడేసిన వస్తువులను తెచ్చుకున్నారు. కైరా పోవెల్ తల్లికి హియర్‌ఫోర్డ్‌లో వున్న అరవయ్యెకరాల పొలంలో బుజ్జి పొదరిల్లు ఏర్పాటు చేసుకున్నాడు. ఆర్కిటెక్చర్‌లో డిగ్రీ చేసిన, ఫర్నిచర్ కోర్సులో పరిజ్ఞానమున్న ఆ జంటకు ఇదంతా పెద్ద కష్టమేం కాలా. రెండు పడకగదులు, ఒక లాంజి, వంటగది. ముందు గదికి అద్దాలు వుండడంవల్ల పచ్చటి పొలాలు కనువిందు చేస్తుంటాయి. మొత్తం మీద ఇందుకు అయిన ఖర్చు వెయ్యి పౌండ్లే. స్వయంగా కట్టుకున్న చిన్ని ఇంట్లో వుండి డబ్బు పొదుపు చేసుకుంటూ సొంత ఇల్లు కొనుక్కోవాలన్న వారి కోరిక తీరాలని ఆశిద్దాం.

నూడుల్స్ ప్రియుడు

పిల్లలకే కాదు. కొందరు పెద్దలకూ నూడుల్స్ అంటే చాలా ఇష్టం. ఎంత అంటే చెప్పలేనంత. 55 సంవత్సరాల 'తోషియో యమామోటో' అలాంటి వారిలో ముందు వరుసలో వుంటాడు. ఇతను దేశ విదేశాలకు చెందిన 5,400 రకాల రామెన్ నూడుల్స్‌ను రుచి చూశాడు. అన్ని రకాలు తిన్నా పూర్తిస్థాయిలో తృప్తినిచ్చిన రుచి మాత్రం ఇంకా తగల్లేదట. అలాంటి రుచిగల నూడుల్స్ దొరికే దాకా తింటూనే వుంటాడట. అన్నట్టు ఇప్పటి వరకు తిన్న వాటన్నిటి వివరాలను తన వెబ్‌సైట్‌లో వుంచాడు. 1996 నుంచి ఇప్పటి వరకు 1.4 మిలియన్ల మంది ఆ సైట్‌ను దర్శించారు.

చెయ్యే గరిట

వంట చేసేటప్పుడు ఒక్క చుక్క మరిగే నూనె మీద పడితేనే అల్లాడిపోతాం. అలాంటిది నిండు బాండీలో చెయ్యి పెట్టడమంటే మాటలా! ఢిల్లీలో ప్రేమ్ కుమార్ వేడి వేడి నూనెలో చేత్తో చేప ముక్కలు వేయిస్తాడు. ఇతనికి కరోల్‌బాగ్‌లో టిఫిన్ సెంటర్ వుంది. ఈ విన్యాసం చూడ్డానికి దేశ నలుమూలల నుంచి అక్కడకు వస్తుంటారు. వేయించిన చేప ముక్కలు, సీఖ్ కబాబ్, మటన్ టిక్కా, పనీర్ టిక్కా, తందూరీ ఆలూ అమ్ముతాడు. ఇంతకీ ఇతగాడికి ఈ విద్య ఎలా పట్టుబట్టిందనే అనుమానం తప్పక వస్తుంది. 1960లో ప్రేమ్ నాన్నగారు రోడ్డుపక్కన ఒక తినుబండారాల బండి నడిపేవాడు. అప్పుడు ఆయన ఇలాగే చేసేవాడట. అది చూసిన ప్రేమ్ కూడా మెల్లగా ఒక్కో వేలు వేడి నూనెలో ముంచడం మొదలెట్టాడు. సాధన మీద పూర్తిగా చెయ్యంతా ముంచడంలో నిష్ణాతుడయ్యాడు. అంత చేసినా అతనికి చిన్న గాయం కూడా కాకపోవడం విశేషం. కాకపోతే ఎవరైనా అడిగినప్పుడు మాత్రమే కాగే నూనెలో చెయ్యి ముంచి చూయిస్తాడు. మిగతా సమయాల్లో గరిటతోనే వేయిస్తాడెండి. అన్నట్టు థాయ్‌లాండ్‌లో ట్రిచాన్ అనే వంటగాడు కూడా ఇదే పద్ధతిలో చికెన్ ముక్కలు చేస్తాడు. అంత వేడి నూనెలో చెయ్యి ముంచినా అతనికీ ఏమీ కాదట. (వీళ్లిద్దరూ చేస్తున్నారు కదా అని ఎవరైనా ప్రయత్నిస్తే ప్రమాదం సుమా!)



చంబా రుమాల్

ఇదొక చేతి రుమాలు. ఇది మీ దగ్గర ఉన్నప్పటికీ ముక్కు చీదుకోవడానికిగాని, చేళ్ళతడి తుడుచుకోవడానికిగాని దీనిని ఉపయోగించడానికి మీకు మనసు రాదు. ఎందుకంటే అద్భుతమైన అల్లికలతో అంత అందంగా ఉంటుందీ చేతిరుమాలు. దీని పేరు చంబా రుమాల్. హిమాచల్‌ప్రదేశ్‌లోని ఒక పట్టణమైన చంబాలో ఇది చాలా ప్రసిద్ధం గనుక దీనికాపేరు వచ్చింది. ఈ రుమాళ్ళ అల్లిక పనులు చేయడంలో అక్కడి రాచకుటుంబాలకూ, సంపన్న వర్గాలకూ చెందిన స్త్రీలు ఎంతో ఆసక్తి కనబరిచేవారు. అందంగా అల్లిక పనులు (ఎంబ్రాయిడరీ) గల ఈ చతురస్రాకార చేతి రుమాళ్ళు పద్దెనిమిది, పందొమ్మిదవ శతాబ్దాలలో అధిక ప్రాచుర్యం పొందాయి. ఈ కాలఘట్టంలో పలువురు అల్లిక కళాకారులు మొఘల్ సామ్రాజ్యాన్ని వదలి హిమాచల్ ప్రదేశ్‌లోని చంబా, కాంగ్రా, బాషోలి ప్రాంతాలలో స్థిరపడ్డారు. ఉన్నత వర్గాలకు చెందిన స్త్రీలు వారిని పిలిపించి, రుమాళ్ళ మీద 'రేఖాచిత్రాలు' గీయించుకుని వాటి మీద పట్టుదారాలతో తామే స్వయంగా అతి సూక్ష్మమైన అల్లికపనులు చేసుకునేవారు. మహాభారత యుద్ధ దృశ్యాలు, గోపికలతో కృష్ణుడు, సిద్ధి, బుద్ధి సమేతుడైన విఘ్నేశ్వరుడు మొదలైన దృశ్యాలను రుమాళ్ళ మీద చిత్రించేవారు. 16వ శతాబ్దంలో గురునానక్ సోదరి బీబ్‌నాన్కి అల్లిన రుమాలునే ఇవాళ ఉన్న రుమాళ్ళలో కెల్లా చాలా ప్రాచీనమైనదిగా చెబుతారు. పంజాబ్ జిల్లాలోని హొషియార్‌పూర్ జిల్లా మ్యూజియంలో ఈ రుమాలు ఈనాటికీ భద్రపరచబడి ఉన్నది.

జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్

మనదేశంలో మొట్టమొదటి నేషనల్ పార్క్, అంటే జాతీయ ఉద్యానవనం అయిన జిమ్ కార్బెట్ నేషనల్ పార్కు దాదాపు 520 చదరపు కిలోమీటర్లు విస్తరించి ఉన్నది. ఈ ఉద్యానవనం 1935వ సంవత్సరంలో అప్పటి యునైటెడ్ ప్రావిన్సిస్ గవర్నర్ హైలీ పేరు మీదుగా 'హైలీ నేషనల్ పార్క్'గా ఏర్పరచబడింది. ఆ తరువాత 1957వ సంవత్సరంలో సుప్రసిద్ధ ప్రకృతి పరిశీలకుడూ, వేటగాడూ, రచయితా అయిన జిమ్ కార్బెట్ పేరును ఈ పార్క్‌కు పెట్టారు. కొండలతో నిండిన పౌరీ గర్వాల్, నైనిటాల్ రెండు జిల్లాల్లో విస్తరించి వున్నదీ పార్క్. రాంగంగ నదీ తీరంలోని ఈ పార్క్‌లో నదికి ఆనకట్ట కట్టి కృత్రిమ తటాకం నిర్మించి ఉన్నారు. ఆకురాల్చే స్వభావం గల చెట్లతో నిండిన పొడి అడవి సంపన్నమైన జీవ వైవిధ్యానికి నిలయంగా ఉంటోంది. పరిరక్షింపబడుతున్న పులులు, ఏనుగులు, జింకలు, సాంబార్ మొదలైన జంతువులతో పాటు 110 జాతులకు పై బడిన చెట్లు 600 జాతుల పక్షులు ఇక్కడ ఉన్నాయి. పులుల సంరక్షణకోసం మన దేశంలో ప్రప్రథమంగా 1973వ సంవత్సరంలో 'ప్రాజెక్ట్ టైగర్ పథకం' ఈ పార్క్‌లోనే ప్రారంభించబడింది.

తెలుసా

ఫౌంటైన్ పెన్నులు

ఒకానొకప్పుడు తాళపత్రాల మీద, రాగిరేకుల మీద ఘంటాలతో రాసేవారు. బొగ్గు, సుద్ద ముక్కలు, పక్షి ఈకలు కూడా కొన్ని కాల ఘట్టాలలో రాతపరికరాలుగా ఉండేవని మన అందరికీ తెలుసు. ఈజిప్టులో మొట్టమొదట పెన్నును రూపొందించారు. అయితే అప్పుడు రాసేవారు పెన్ను నిబ్బును మాటిమాటికీ సిరాలో అద్ది మరీ రాయవలసివచ్చేది. ఈ పద్ధతి పట్ల లూయిస్ వాటర్‌మన్ అనే ఒక ఇన్సూరెన్సు బ్రోకర్‌కు విసుగు పుట్టింది. నిబ్బుకు సిరాను నిరంతరాయంగా సరఫరా చేసే విధానాన్ని రూపొందించలేమా అని తీవ్రంగా ఆలోచించాడు. ఆయన సైన్సుకు సంబంధించిన వ్యక్తి కాదు. అయినా, సన్నటి రంధ్రం గుండా పెన్నుబాడీ నుంచి నిబ్బుకు ఇంకును సరఫరా చేసే పద్ధతిని రూపొందించాడు. అదే ఫౌంటైన్ పెన్ అయింది. 1884వ సం.లో దీనిని ఆయన పేటెంట్ చేశాడు.

ఎత్తయిన చెత్త ప్రదేశం!

ఎత్తయిన పర్వత శిఖరం ఎవరెస్ట్! నిజమే. అయితే పరిస్థితులను చూస్తుంటే మరో పది, పదిహేను సంవత్సరాలలో ఎవరెస్టు ఎత్తయిన చెత్త ప్రదేశంగా మారిపోయే ప్రమాదం ఉందంటున్నాడు జామ్లింగ్ నార్గే. యాభై ఒక్క సంవత్సరాల క్రితం ఎడ్మండ్ హిల్లరీతో కలిసి మొట్టమొదటిసారిగా ఎవరెస్టు పర్వత శిఖరాన్ని అధిరోహించిన టెన్సింగ్ నార్గే కుమారుడితడు. ఇతడే కాదు. ఎవరెస్టును అధిరోహించి వచ్చే పర్వతారోహకులు – ఎత్తయిన ఈ పర్వతశిఖరం క్రమంగా ఎత్తయిన చెత్త ప్రదేశంగా మారుతున్నదని హెచ్చరిస్తున్నారు. పర్వతారోహకులు తిని పడేసే ఆహారపదార్థాలు కాగితాలు, ప్లాస్టిక్ కప్పులు, ఖాళీ సీసాలు, గుడారాలు మొదలైనవాటితో శిఖరాగ్రం నిండిపోతున్నదని జామ్లింగ్ అంటున్నాడు. శిఖరాగ్ర ప్రదేశం ఒక్కసారిగా ఇరవై ముప్పై మంది నిలబడగల 200 చదరపు అడుగుల విస్తీర్ణం మాత్రమే ఉన్నది. ఇక మీదట విమానాశ్రయాల్లోలాగా పర్వతారోహకులను కూడా పరీక్షించి వట్టి చేతులతోనే అనుమతించవలసిన అవసరం ఉంది!

పల్లకీ కుచ్చు

మరాఠీ మూలం: కాశీబాయి కనిత్కర్
తెలుగు: డా॥ దేవరాజు మహారాజు



◆ కథ

దగాపడ్డ అక్కాచెల్లెళ్ళ జీవితాల్లోకి వెలుగు ప్రసరించడానికి మా సంస్థ తీవ్రంగా కృషి చేస్తోంది. అందులో భాగంగానే ద్వారకికి ఉత్తరం రాయాలన్న నిర్ణయం తీసుకున్నాం. మొత్తానికి కుప్పకూలిన బతుకు ద్వారకిది. ఆమె ప్రస్తుతం తన తల్లి ఇంట్లో ఉంటోంది. కొద్దిగా చదవనూ రాయనూ వచ్చు గనుక తను ఉత్తరం రాయడం ఎవరో చూస్తారని ఆందోళన పడడం ఉండదు. మాకు తప్పక జవాబు రాస్తుందని మా నమ్మకం. అలాగే జరిగింది. ద్వారకి మాకు సుదీర్ఘమైన ఉత్తరం రాసింది. ఆ ఉత్తరం ఇలా కొనసాగింది.

చిరంజీవి కుమారి మనూను ఆశీర్వదించి వ్రాయునది.

నీ ఉత్తరం అందుకుని చాలా సంతోషించాను. నీ లాంటి విద్యావంతురాలు, ధనవంతురాలు నా బోటి దాన్ని గుర్తించి, గుర్తుంచుకుని ఉత్తరం రాయడమంటే మామూలు విషయం కాదు. జీవితాంతం నా బాధ్యతను స్వీకరిస్తానని అగ్నిసాక్షిగా పెళ్ళి చేసుకున్న వ్యక్తితో సహా కుటుంబంలోని వారు సమాజంలోని వారు అందరూ వెలివేసిన దాన్ని. ఈ ప్రపంచానికే పనికి రానిదాన్ని. అందువల్ల ఎవరైనా ఓ చిన్న ఓదార్పు మాట మాట్లాడితే చలించిపోతున్నాను. అందులో నువ్వు ఒక ఉత్తరమే రాశావయ్యే. ఇక నా పరిస్థితి ఎలా ఉంటుందో వేరే చెప్పనవసరం లేదనుకుంటా. ఈ భూ ప్రపంచంలో నా మీద సానుభూతి చూపించే వాళ్లు ఒక్కరంటే ఒక్కరు కూడా లేరు. సమాజానికి భయపడి, సంప్రదాయాలకు భయపడి మా అమ్మ కూడా నన్ను తిట్టని రోజు లేదు. నాకు తెలుసు. నేనంటే ఆమెకు అపారమైన ప్రేమని! కాని ఏం చేస్తుంది? నా బతుకు తగలబడి పోయింది. మనూ తాయ్! రెక్కలు కట్టుకుని నీ దగ్గరికి వచ్చి వాలాలని ఉంది. కానీ వీళ్ళు నన్ను ఇష్టపడ్డప్పుడే నీ దగ్గరికి రానీయరు. అంత దాకా నాకు ఇలా ఉత్తరాలతో కాలక్షేపం చేయక తప్పదు.

నా దౌర్భాగ్యానికి నాటక సమాజం వాళ్ళని తప్పు పట్టను గానీ నా విషాద గాథకు ప్రారంభం అక్కడే జరిగింది. ఊళ్ళోకి ఒక నాటక కంపెనీ వచ్చింది. ఈయన ప్రతిరోజు రాత్రి అక్కడికి వెళు తుండేవారు. విషయం అత్తా మామలకు తెలిసి ఇంట్లో కొద్దిగా ఘర్షణ ప్రారంభమైంది. ఓ రోజు రాత్రి ఆయన నా దగ్గరున్న బంగారు ఆభరణాలన్నీ ఇచ్చేయమన్నారు. పెద్దవాళ్ళకు తెలియకుండా ఎలా ఇచ్చేది? అత్తయ్యగారికి తెలిస్తే కోప్పడతారని చెప్పాను. ఆయన విన్లేదు. రాత్రంతా నన్ను చిత్రహింసలకు గురిచేశారు. అయినా నేను ఒప్పుకోలేదు. అత్తమామలు నన్ను అనుమానించే అవకాశం ఉంది కదా? అందుకే ఎదిరించాను. కాని చివరకు ఆయన దుడ్డుకర్రతో నా తల పగల కొట్టి ఆభరణాలన్నీ దోచుకుపోయారు. మరునాడు ఉదయం ఎనిమిదింటికి మా అత్తగారు, ఆడపడుచు నా కోసం ఇల్లంతా వెతికి పై అంతస్థులో మా పడక గదికి వచ్చారు. నేను స్పృహ తప్పి పడిపోయిన విషయం గ్రహించి సపర్యలు చేశారు. జ్వరం వల్ల నా ఒళ్ళు కాలిపోతోందని గ్రహించారు. నా తల దిండు రక్తంతో తడిసి ముద్దవడం గ్రహించి జరగరాని ఘోరం ఏదో జరిగిందని తెలుసుకున్నారు. ఇంట్లో బంగారు వస్తువులన్నీ పోయాయని నిర్ధారించుకుని మామయ్య గారికి చెప్పారు. వారికి ఏదో చెప్పాలని నేను విఫల ప్రయత్నం చేశాను. డాక్టరుని పిలిపించి చికిత్స చేయించారు.

ఆయన ప్రతిరోజూ మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చేవారు. రాత్రి ఆ సంఘటన తర్వాత మరునాడు మధ్యాహ్నం రాలేదు. రాత్రయినా

రాలేదు. మా మరిది గారిని ఊరంతా తిరిగి చూడమని పంపించారు. ఎక్కడా కనిపించలేదని అతను తిరిగి వచ్చాడు. ఈయన మరునాడు కూడా రాలేదు. కంపెనీ మకాం ఎత్తేసింది. బహుశా వాళ్ళతో ఈయన వెళ్ళిపోయి ఉంటారని అందరూ అనుకున్నారు. గాయం బలంగా తగలడం వల్ల భయంలోంచి తేరుకోకపోవడం వల్ల జ్వరం తగ్గక పోవడం వల్ల నేను మామూలు మనిషిని కావడానికి ఒక నెల పట్టింది. మామగారు పట్నానికి మనుషుల్ని పంపి కొడుకు కోసం వెతికించారు.పత్రికల్లో ప్రకటనలు ఇప్పించారు. ఫలితం కనిపించలేదు

చూస్తూ చూస్తూ అలా ఏడు సంవత్సరాలు గడిచిపోయాయి. ఆయన ఇంటికి తిరిగి వస్తాడన్న ఆశ ఇక లేదు. నా పరిస్థితి సమాజంలో దయనీయంగా మారింది. నేను ముత్తైదువునా? విధవరాలినా? తేల్చుకోలేని విచిత్ర పరిస్థితి నాది. నాకన్నా దుర్భరమైన జీవితాలు గడుపుతున్న వారున్నారట! నిజమే కావొచ్చు. వారి భర్తలు చనిపోయారు. ఒక రకంగా వారు మానసికంగా ఒంటరి జీవితం గడపడానికి సిద్ధపడ్డారు. కానీ నా పరిస్థితి అలా కాదే. ఉన్న ఫళాన ఆయన రావొచ్చు. నాలుగు రోజులుండి మళ్ళీ మాయం కావొచ్చు. అమ్మలక్కలంతా అనడం ఏమిటంటే నాకు బొట్టయినా దక్కింది గనుక నేను అదృష్టవంతురాలినని. అమ్మా మనూ! నువ్వే చెప్పమ్మా. నాదేం అదృష్టమో!

శుభకార్యాలకు వేటికీ నేను వెళ్ళొద్దు. వంటకాలు ముట్టుకోవద్దు...పెళ్ళికి ముందు నా జాతకం సరిగ్గా చూసుకోకపోవడం వల్లే ఇన్ని అనర్థాలు జరిగాయని మా అత్తామామలు అంటుండేవారు. వాళ్ళ జాతకం, వాళ్ళ అబ్బాయి జాతకం గురించి వాళ్ళు మాట్లాడరు. నాలో ఏదో దుష్ట శక్తి ఉండడం వల్లనే వాళ్ళబ్బాయి ఇలా అయిపోయాడని వారు గట్టిగా నమ్మారు. నా మొగుడు నన్ను హింసించి హింసించి వదిలేసిపొయ్యాడు. నా అత్తమామలు నన్ను నానా రకాలుగా బాధించి బాధించి చివరకు ఓ రోజు ఇంట్లోంచి వెళ్ళగొట్టారు. అలాంటి స్థితిలో నేనెటు వెళ్ళగలను? తల్లిగారింటికొచ్చి తల దాచుకున్నాను. ఇక్కడి సమస్యలు ఇక్కడివి. మా అన్నయ్యలకు తమ్ముళ్ళకు నేనిక్కడ ఉండడం ఏ మాత్రం ఇష్టం ఉండదు. కానీ మా అమ్మ గురించి వాళ్ళు నోరు మెదపలేదు. అమ్మ పెద్దదై పోయింది నా శాయ శక్తులా సేవలన్నీ చేసి ఆమెను కాపాడుకుంటూ కాలం దొర్లిస్తున్నాను. ఆమెకు ఏదైనా అయితే ఇక నా పరిస్థితి ఏమిటో? ప్రస్తుతానికి ఇంతే? మీరు సూచించిన విధంగా మీ దగ్గరికి రావడానికి ప్రయత్నిస్తూ ఉంటాను. మీకు నాకు మధ్య అనురాగం, ఆత్మీయత మరింతగా పెంచాలని ఆ దేవుణ్ణి కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

అభాగ్యురాలు మీ ద్వారకి

మేమంతా ఉత్తరం విడివిడిగానూ సామూహికంగానూ చదివాం. విషయాల్ని విశ్లేషించాం. తనను పిలిపించుకుని మా సంస్థలో చేర్పించుకోవాలని అనుకున్నాం. బయలుదేరి రావడానికి ఇతర ఖర్చులకూ కొంత డబ్బు పంపుదామని నిర్ణయించుకున్నాం.

✦

రచయిత్రి గురించి



కాశీబాయి కనిత్కర్ (1861–1948) ప్రముఖ మరాఠీ రచయిత్రి. అవి మహిళలు తమను తాము రెండవ స్థాయి మనుషులుగా భావిస్తూ అంతా తమ దురదృష్టం అనుకుంటూ మూఢనమ్మకాల మధ్య కుళ్ళిపోయిన సంప్రదాయాల మధ్య దుర్భరమైన జీవితం గడుపుతున్న రోజులు. స్త్రీలకు చదవడం, రాయడం నేర్పించని సమాజంలో కాశీబాయి పుట్టి పెరిగారు. ఆత్మ విశ్వాసంతో మరాఠీ, ఇంగ్లీషు భాషా సాహిత్యాల మీద మంచి పట్టు సాధించారు. ఈమె వివాహం, గోవిందరావుతో జరిగింది. అతను ఉన్నత కుటుంబీకుడు. విద్యావంతుడు కావడంతో భార్యకు తగినంత ప్రోత్సాహం ఇచ్చాడు. అనుకోకుండా సాహితీ మేరునగధీరుడైన హరినారాయణ ఆప్టేతో కలిగిన పరిచయం ఆమెకు ఎంతగానో ఉపయోగపడింది. ఆయన ప్రభావం వల్లనే ఆమె యూరోపియన్ కవులను రచయితలను చదవగలిగారు. తొలి నవల రంగారావు శీర్షికతో 1903లో ప్రకటించారు. పాల్టీచగొండ (పల్లకీ కుచ్చు) అనే రచన 1928లో వెలువడింది. స్త్రీ విద్య – ప్రాముఖ్యం గురించి ఆనాటి పత్రికల్లో ఈమె విరివిగా రచనలు చేశారు. ఈ రచన నాటి మహిళల దీనస్థితికి అద్దం పట్టింది.

కవిత్వమ్

చినుకు రాలని సీమ నేల

- అడిగోపుల వెంకటరత్నమ్
9848252946

నీలాకాశ నేపథ్యంలో మేఘమాలికలు
ధవళ వర్ణ వస్త్రాల్లా తేలాడుతుంటాయి
ఒకసారి ఏకిన దూది పింజలుగా
ఒకసారి పికాసో చిత్రంలా
ఒకసారి రవివర్మ కుంచె రంగులా
ఒకసారి రణక్షేత్ర అశ్వాల్లా
ఒకసారి అంబారీ కట్టిన ఏనుగుల్లా
ఒకసారి వలస వచ్చిన పక్షుల్లా
వేషాలు వేస్తూ రంగులు మార్చుతూ
ఎన్నెన్నో ఊహాకారాలు!
ఉదయించే సూర్యుణ్ణి చూసి
ఎరుపెక్కిన బుగ్గల్తో
వొళ్లంతా రంగుమారుతుంది
అస్తమయాన దు:ఖమయమై
పశ్చిమాన రంగులు పూస్తాయి
నేలపై కోపంతో
సూర్యుడితో చేతులు కలిపి భూమిని కాల్చమని
ఆకాశ సరిహద్దు శయ్యాగృహాల్లో నిద్రిస్తాయి
భానుడితో ఘర్షించి
ఆకాశంలో పందిరి వేసి నేలకు నీడనిస్తాయి
పున్నమి చంద్రుడుకి పైట కప్పి
ఊపిరాడని చంద్రుడు పక్కకు తప్పుకుంటే
మెడకు మేఘమాలిక మఫ్లరై
చందమామకు అందమౌతుంది
ఒకసారి నేలకు కృతజ్ఞత చాటుతాయి
ఒకసారి కృతఘ్నత చెబుతాయి!
ఇక్కడ సముద్రం కన్నబిడ్డ మేఘమాలిక
రక్తసంబంధాల్ని తెంచి ఎటో పారిపోతుంది
ఎక్కడో సముద్రం కన్నబిడ్డ వలసవచ్చి
ఇక్కడ వరదై పారి బంధం ముడి వేస్తుంది
రాగద్వేషాలకు
రాజకీయాలకు మేఘాలు అతీతం కావు
నచ్చని చోట నాలుగు చినుకులు రాల్చి
నచ్చిన చోట కుంభవృష్టి కురిపిస్తాయి
పిడుగుల్ని కురిపించి ప్రాణాలు తీస్తాయి
మెరుపుల్ని పండించి ఆహ్లాదపరుస్తాయి!
ఉరుకుల పరుగుల మేఘానికో విన్నపం
ఇదిగో ఇక్కడ నేల తడవని సీమనేల
ఎండిన చెరువుల పెదాలు తపస్సు చేస్తున్నాయి
గ్రాసం లేక పశువులు మోరెత్తి ప్రార్థిస్తున్నాయి
వ్యథలు నిండిన రైతుల కళ్ళు రోదిస్తున్నాయి
ఎండిన మోళ్లు చిగుళ్లను కలవరిస్తున్నాయి
నాలుగు పదున్ల వానలు కురిసి
నలుగుర్ని ఏరువాకకు నడిపించాలి!

పులిహోర

కావాల్సిన పదార్థాలు

బాస్మతి రైస్- ఒక కప్పు
పసుపు-ఒక టీ స్పూన్
బెల్లం- రెండు టేబుల్ స్పూన్లు
ఉప్పు-రుచికి సరిపడా
వేరుశనగపప్పు-రెండు టేబుల్ స్పూన్లు
నీళ్ళు- మూడు కప్పులు

చింతపండు పేస్ట్ కోసం

చింతపండు గుజ్జు-రెండు టేబుల్ స్పూన్లు
మెంతులు-ఇష్టమైతే కొద్దిగా
ధనియాలు- ఒక టేబుల్ స్పూన్
ఎండు మిర్చి- మూడు
ఉప్పు-చిటికెడు

మసాలా కోసం

కొబ్బరి తురుము-1/2 కప్పు
తెల్ల నువ్వులు- ఒక టేబుల్ స్పూన్

పోపు కోసం

నువ్వుల నూనె-ఒక టేబుల్ స్పూన్
ఆవాలు-ఒక టీ స్పూన్
ఇంగువ - చిటికెడు
ఎండు మిర్చి- రెండు
ఉద్దిపప్పు-ఒక టీ స్పూన్
శనగపప్పు-ఒక టీ స్పూన్
కరివేపాకు- ఆరు లేదాఏడు

తయారీ

ముందుగా బియ్యంలో నీళ్ళు పోసి శుభ్రంగా కడగాలి.తర్వాత బియ్యంలో సరిపడా నీళ్ళు పోసి అన్నం వండి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఒక కప్పులో కొద్దిగా నీళ్ళు తీసుకొని అందులో కొద్దిగా మెంతులు, ధనియాలు, ఎండు మిర్చి వేసి కొద్దిసేపు నీళ్ళలో నానబెట్టుకోవాలి. తర్వాత స్టౌ మీద పాన్ పెట్టి కొబ్బరి తురుము వేసి ఐదు నిమిషాలు తక్కువ మంటలో ఫ్రై చేసుకోవాలి. తర్వాత అందులో నువ్వులు కూడా వేసి మరో రెండు నిమిషాలు ఫ్రై చేసుకోవాలి. ఈ మొత్తం మిశ్రమం చల్లారనివ్వాలి.

చల్లారిన కొబ్బరి తురుము, నువ్వులు మిక్సీలో వేసి రఫ్‌గా పొడి చేసుకొని పక్కన తీసి పెట్టుకోవాలి. ఇప్పుడు మెంతుల మిశ్రమంలో నీరు వంపేసి, మిక్సీలో వేసి, వీటితో పాటు చింతపండు గుజ్జు కూడా వేసి మెత్తగా పేస్ట్ చేసుకొని పక్కన పెట్టుకోవాలి. తర్వాత పాన్‌లో కొద్దిగా నువ్వుల నూనె వేసి ఒక నిమిషం వేడి అయ్యాక అందులో పోపు దినుసులు వేసి ఒక్క నిమిషం ఫ్రై చేసుకోవాలి. పోపు వేగిన తర్వాత అందులో బెల్లం తురుము, చింతపండు గుజ్జు మిశ్రమాన్ని వేసి ఒక నిమిషం ఫ్రై చేసుకోవాలి. తర్వాత అందులోనే ఉప్పు, పసుపు, అన్నం వేసి మొత్తం మిశ్రమాన్ని మిక్స్ చేస్తూ రెండు నిమిషాలు ఫ్రై చేసుకోవాలి. తర్వాత మంట తగ్గించి ముందుగా వేగించి పెట్టుకొని వేరుశనగపప్పు చల్లుకొని వేడి వేడిగా సర్వ్ చేయాలి.

వంకాయ రైస్

కావాల్సిన పదార్థాలు

వంకాయలు-ఏడు
బియ్యం-అరకిలో
జీలకర్ర, ఆవాలు- రెండు టీ స్పూన్స్
మినపప్పు-ఒక టేబుల్ స్పూన్
పచ్చి మిరపకాయలు-ఆరు
లవంగాల పొడి-ఒక టేబుల్ స్పూన్, అల్లం ముక్కలు-ఒక టేబుల్ స్పూన్, దాల్చిన చెక్కల పొడి-ఒక టేబుల్ స్పూన్, నూనె-తాలింపునకు సరిపడా
ఉప్పు- తగినంత

తయారీ

ముందుగా బియ్యాన్ని శుభ్రంగా కడిగి అరబెట్టుకుని ఉంచుకోవాలి. తరువాత వంకాయలను నిలువుగా ముక్కలుగా కోసుకోవాలి. తర్వాత పచ్చి మిరపకాయలు, అల్లం కలిపి రుబ్బి చిన్నముద్దగా చేసుకుని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు స్టౌ వెలిగించి గిన్నెను ఉంచి నూనె పోసి మరగిన తర్వాత ఆవాలు, జీలకర్ర, పచ్చి మిరపకాయ ముక్కలు, అల్లం ముక్కలు, లవంగాల పొడి, దాల్చిన చెక్క పొడి వేసి వేయించుకోవాలి. ఇవి వేగిన తర్వాత కోసి ఉంచుకున్న వంకాయ ముక్కలు వేసి వేయించుకోవాలి. ఆ తరువాత కడిగి ఉంచుకున్న బియ్యం వేసి బాగా కలుపుకోవాలి. ఇప్పుడు ఉప్పు, పసుపు, మసాల పొడి వేసి బాగా కలిసేట్టు కలుపుకోవాలి. తర్వాత వంతుకు రెండు వంతులు నీళ్ళు పోసి మూత పెట్టి సన్నని సెగపై ఉడకనివ్వాలి.ఉడికిన తర్వాత దింపే ముందు కొత్తిమీర జల్లుకుంటే మంచి సువాసన వస్తుంది.

నువ్వుల పిండి పులిహోర

కావాల్సిన పదార్థాలు

బియ్యం-గ్లాసు, మినపప్పు-రెండు చెంచాలు, సెనగపప్పు-చెంచా, ఆవాలు- అర చెంచా, మెంతులు-పావు చెంచా, ధనియాలు-రెండు చెంచాలు, ఎండు మిర్చి-ఎనిమిది, జీలకర్ర-అర చెంచా, పల్లీలు-రెండు చెంచాలు, నువ్వులు- మూడు చెంచాలు, ఎండు కొబ్బరి తురుగు- నాలుగు చెంచాలు, ఉప్పు-తగినంత, నూనె-పావు కప్పు, కరివేపాకు-రెండు రెబ్బలు, నెయ్యి-రెండు చెంచాలు, పోపు దినుసులు-రెండు చెంచాలు, పచ్చిమిర్చి- నాలుగు, చిక్కటి చింతపండు గుజ్జు-పావు కప్పు

తయారీ

బియ్యాన్ని కడిగి ఒకటిన్నర గ్లాసు నీళ్ళు పోసి పొడిపొడిగా ఉడికించుకుని వెడల్పాటి పళ్లెంలో తీసుకోవాలి. ఓ గిన్నెలో చింతపండు గుజ్జును ఉడికించుకోవాలి. ఇప్పుడు బాణలిలో నూనె లేకుండా మినపప్పు, సెనగపప్పు, ఆవాలూ, మెంతులూ, ధనియాలు, ఎండు మిర్చి, పల్లీలు, నువ్వులు, ఎండుకొబ్బరి, జీలకర్ర వేసుకుని వేయించుకోవాలి. ఈ దినుసులన్నింటినీ మిక్సీలో తీసుకుని తగినంత ఉప్పు వేసుకుని మరీ మెత్తగా కాకుండా పొడి చేసుకోవాలి. ఉడికించిన అన్నంపై ఈ పొడిని వేసుకోవాలి. నెయ్యి, నూనె వేడి చేసి తాలింపు దినుసుల్ని వేయించుకోవాలి. అందులోనే పచ్చి మిర్చి తరుగూ కరివేపాకు రెబ్బలు వేయించుకోవాలి. తరువాత చింతపండు గుజ్జు కూడా వేసి రెండు నిమిషాల తరువాత ఈ మిశ్రమాన్ని అన్నంపై వేసేయాలి. తాలింపు అంతా కలిసేలా అన్నాన్ని కలిపితే సరిపోతుంది.

అతికిద్దాం

బంటికి మతిమరుపు ఎక్కువైపోతోంది. ఆవు బొమ్మని కత్తిరించి తిరిగి వాటిని అతికించడం మరిచిపోయాడు. కాస్త అతికించి అందంగా తయారుచేద్దాం.



రంగులు అద్దుదాం

బుజ్జి స్టార్

హాయ్ ఫ్రెండ్స్ ! నేను తెలుగు సినిమా హీరోయిన్‌ని. ఇది నా చిన్ననాటి ఫోటో...నేనెవరో కనిపెట్టండి...!

జవాబు: నిత్యమీనన్



ఆకుల గబ్బిలం

నిజ్జం. ఆకులతో గబ్బిలం బొమ్మ చేయొచ్చు. కావాలంటే చూడండి. గబ్బిలం ఆకారానికి సరిపడా ఆకులను ఎంపిక చేయండి. ఒక పేపరు మీద అతికించండి. అంతే. చేస్తారా! మరి ఆలస్యం ఎందుకు?

భిన్నమైదని ఏది?

ఇక్కడ నాలుగు రకాల జంతువులు గుంపుగా వున్నాయి. చూడ్డానికి అన్నీ ఒకేలా వున్నా... ప్రతి వరసలోనూ ఒకటి మాత్రం తేడాగా వుంది. వాటిని కనుగొనండి?



విరిసే దీపాలు

ఇజ్రాయిల్ రాజధాని నగరం జెరూసలెం. అక్కడ నాలుగు ఎర్రటి భారీ పుష్పాలు వున్నాయి. ఒక్కోటి 9 మీటర్ల పొడవు, వెడల్పు వుంటాయి. చూపరులను తెగ ఆకట్టుకుంటున్నాయి. ఎందుకంటే అవి అలాంటి ఇలాంటి పువ్వులు కావు. ఎండకు ఎండవు. వానకు నానవు. ఏ కాలంలో చూసినా తాజాగా ఎర్రగా మెరిసిపోతుంటాయి. ఇవికాక ... వీటికి మరో ప్రత్యేకత కూడా వుంది. ఎవరైనా ఆ పువ్వుల దగ్గరకు వెళ్లి నిలబడితే చాలు... అప్పటి వరకు ముడుచుకుని వున్నవి కాస్తా విచ్చుకుంటాయి. వాటిలో వున్న దీపాలు కూడా వెలుగుతాయి. అటుగా రైల్వే ట్రాక్ మీద రైలు రాబోతున్నప్పుడు కూడా ఈ నాలుగు పుష్పాలు విచ్చుకుంటాయి. ప్యాసెంజర్లు రైలు దిగాక నీడనివ్వడానికి ఈ పుష్పాలు ఎప్పుడూ సిద్ధంగా వుంటాయి. వీటిని స్థానిక మున్సిపాలిటీ ఏర్పాటు చేసింది. సందర్శకులను ఆకట్టుకోవడానికే కాదు. స్థానికులకు ఎండలో వానలో ఆశ్రయం ఇవ్వడానికి కూడా.

ఎక్కడ దాక్కున్నాయో

రాజుల కాలంనాటి బొమ్మ ఇది. ఇందులో ఏడు వస్తువులు దాగి ఉన్నాయి. వాటిని కింది ఇచ్చాం కదా. గుర్తించి సున్నా చుట్టండి.

పదాలు ఎక్కడున్నాయి?

పడవ బొమ్మలో కొన్ని అక్షరాలున్నాయి. అయితే వాటిలోనే ఆరు పదాలు దాక్కున్నాయి. మీరేం చేయాలంటే... అడ్డంగా, నిలువుగా, వంకరగా ఎలా దాక్కున్నా...వాటిని గుర్తించి సున్నా చుట్టేయండి.

సాహితీ యశస్వి- వ్యాస మాలిక

'పరిశోధనలో, కవితా రచనలో, ఉపన్యాస ఒరవడిలో అలజడిని సృష్టించే సృజన సంపన్నుడు- భజన శక్తులను లక్ష్య పెట్టని అభ్యుదయాంశను నిలువెల్లా నింపుకున్న సాహిత్య వ్యక్తిత్వం ఎస్వీది' అంటూ జ్ఞానపీఠ అవార్డ్ గ్రహీత డా॥సి.నారాయణ రెడ్డి ఎస్వీ. సత్యనారాయణను అభినందిస్తారు. 60 సంవత్సరాలు నిండిన సందర్భంలో అరసం జాతీయ నేతకు సాహితీ పెద్దలు అందించిన అక్షరాభి నందనలు- ఆశీస్సులు, ఈ గ్రంథంలో (దాదాపు 45 మంది రాసినవి) ఉన్నాయి.

డా॥సి.నారాయణ రెడ్డి, డా॥ఎన్.గోపి, డా॥రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి, కాత్యాయనీ విద్మహే, డా॥ ఏటుకూరి ప్రసాద్, డా॥ కత్తి పద్మారావు, డా॥ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, డా॥ అవంత్స సోమ సుందర్, డా॥ నాళేశ్వరం శంకర్, డా॥ మానేపల్లి ఆచార్య మసన చెన్నప్ప, డా॥ సి.హెచ్ లక్ష్మణ చక్రవర్తి, డా॥ అద్దేపల్లి రామమోహన్ రావు, పరకాల పట్టాభిరామారావు, పెనుగొండ లక్ష్మీ నారాయణ, వెలుదండ నిత్యానందరావు, డా॥ రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు, డా॥జి బాలశ్రీనివాసమూర్తి, ప్రొ॥ ఆనందరామం, గూడ శ్రీరాములు, వేల్పుల నారాయణ, డా॥వై. రెడ్డి శ్యామల, డా॥ కరిమెళ్ల లావణ్య, డా॥సాగి కమలాకర శర్మ, డా॥జ్యోత్స్న ప్రభ, డా॥వి.ఆర్.రాసాని, జింబో, డా॥ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు, లాంటి వారి అభిప్రాయాలు ఈ పుస్తకంలో ఎస్వీ సాహితీ సాంస్కృతిక కృషిని అవిష్కరించాయి.

'ప్రపంచీకరణపై ప్రతిస్పందించిన తెలుగు కవిత్వం' అంటూ సూర్యధనుంజయ్ వ్యాసం, ప్రపంచీకరణ ప్రకంపనలను ప్రశ్నించిన "జీవితం-ఒక ఉద్యమం" ఎం. దేవేంద్ర వ్యాసం, గ్లోబలైజేషన్ కథలు సలీం" అభిప్రాయాలు పాఠకుల్ని నేటి వాస్తవిక రాజకీయ అంశాల్లోకి తీసుకెళ్తాయి. చైతన్య పరుస్తాయి. అరసంలో క్రియాశీలక ఉద్యమ సూర్యుడుగా ఎస్వీ తెలుగు సాహిత్యోద్యమంలో ఓయు తెలుగు శాఖాధిపతిగా, అరసం నేతగా, కవిగా, రచయితగా, విప్లవ కార్యకర్తగా, విమర్శకునిగా సాహితీ సాంస్కృతిక రంగ కార్యకర్తగా బహుముఖ కృషి వలుడు ఎస్వీ వారి అపూర్వ కృషికి అద్దంగా నిలుస్తుంది. ఈ సంపుటి 40 సంవత్సరాల సాహితీ చరిత్రకారుని అక్షర మానంలోని కృషి.



సాహితీ యశస్వి- వ్యాస మాలిక, సంపాదకులు: ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు, డా॥ కరిమెళ్ళ లావణ్య, పేజీలు: 204/-, వెల: 150/-, ప్రతులకు: సాహితీమిత్రులు, 1-7-1046/23, రాంనగర్, అజామాబాద్, హైదరాబాద్.

-తంగిరాల చక్రవర్తి

వి. యాన్. జెంఘిజ్‌ఖాన్

ఇవాళ మంగోలియా అని ప్రపంచ పటంలో ఉన్న భూభాగం నుంచి క్రీస్తు పూర్వం మూడవ శతాబ్దంలో హూణులు తమ మహా సామ్రాజ్యాన్ని స్థాపించారు. మంగోలుల జాతి మహానేత ఈ జెంఘిజ్ ఖాన్ (గతంలో తెన్నేటి సూరిగారు చంఘీజ్ ఖాన్ రాశారు) దేశ చరిత్రలు అన్న ఖండికలో శ్రీశ్రీ 'జెంఘిజ్ ఖాన్' అని రాశారు. జెంఘిజ్ ఖాన్ 1155 సంవత్సరంలో పుట్టాడు (1162-1167 అని కొందరంటారు). తండ్రి యాసుకై భగత్తూర్- తల్లి యూలన్ (మెర్కిట్ తండాకి చెందిన స్త్రీ). "టెమూజిన్" అని తమ బిడ్డకు వీళ్ళు పేరు పెట్టుకొన్నారు. ఉక్కు మనిషి అని అర్థం. కుమ్మరి పనులు చేశాడు. జెంఘిజ్‌ఖాన్ చిన్నతనంలో బానిసగా జీవించాడు. ఎన్నో రాజ్యాలు, దేశాలు జయించి నగర జీవిత విధానం మీద సంచార జీవిత విధాన ఆధిక్యత జెంఘిజ్ ఖాన్ చూపించదలచుకున్నాడు. తాను జయించిన ప్రాంతాల నుంచి కప్పం రాబట్టుకుంటూ తాము పచ్చిక బీళ్ళ మీదనే ఉండాలని అనుకొన్నాడు.

మంగోలుల మహానేత జెంఘిజ్‌ఖాన్ గురించి భారత తొలి ప్రధాని నెహ్రూ this man fascinates me అన్నాడు.

ఈ పుస్తకం మొదటి ఖండంలో ఐదు భాగాలు, రెండవ ఖండంలో నాల్గు భాగాలు ఉన్నాయి. చాలా పేజీల్లో ఫుట్ నోట్ అర్థాలు ... సాంకేతిక పదాలు ప్రచురించారు. 13వ శతాబ్దంలో ఖోరెస్మ్ (ఇస్లామిక్ సామ్రాజ్యం) గురించి విపులంగా ఈ గ్రంథంలో చక్కటి కథాత్మకంగా రాశారు. పోరాట చారిత్రాత్మక రాచరిక ఘట్టాలు పాఠకుల్ని ఆసక్తిగా చదివిస్తాయి. జెంఘిజ్ ఖాన్‌కి కావలసింది తమ సంచార తెగల ఆధిపత్యం. పచ్చిక బీళ్ళని, పర్వత కనుమల్ని స్వాధీనం చేసుకునే దాకా దండయాత్రలు జరిపాడు. పెకింగ్ నగరం దాకా వెళ్ళాడు గాని దాన్ని ముందే ముట్టడించలేదు. తర్వాత ముట్టడించాడు. ఇలా జెంఘిజ్ ఖాన్ చేసే దురాక్రమణలు దండయాత్రలు నవలీకరణగా ఈ పుస్తకం ఆసాంతం చదివింపజేసేలా రాశారు. చారిత్రక కథనం బాగుంది. అనువాదం చదివిస్తుంది.



వి.యాన్. జెంఘిజ్‌ఖాన్, అనువాదం: ఆర్వియార్, పేజీలు: 358/-, వెల: 250/-, ప్రతులకు: నవ చేతన పబ్లిషింగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ, హైదరాబాద్

- ప్రసన్నకుమారి

భలే... భలే... ఆర్టిస్టువోయ్

'మడిసన్నాక ... కూసింత కళా పోసనుండాల' అన్న డైలాగ్ ఇదిగో ఇలాంటివి చూసినప్పుడు తప్పక గుర్తొస్తుంది. సృజించడానికి, ఆస్వాదించడానికి కళా హృదయం కావాలి. అది వుండాలే గానీ బలపాలతోనే కాదు బూరలతోనూ కళాఖండాలు సృష్టించవచ్చు. పాతికేళ్ల జపాన్ ఆర్టిస్టు మసాయోషి మత్సుమోటో సరిగ్గా అలాంటి కుర్రాడే. ఎటువంటి పెన్నులు, టేపులు వాడకుండా అచ్చంగా బెలూన్లతోనే ఈ ప్రాణి ప్రపంచాన్ని సృష్టించాడు. మనుషులను మొదలుకొని కీటకాలు, పక్షులు, జంతువులు వరకు అతని చేతిలో రూపుదిద్దుకోని జీవి లేదంటే నమ్మండి. ఏ ఒక్క బొమ్మను చూసినా 'అర్రే...ఇంత చిన్న ప్రాణిని కూడా బూరలతో ఎంత చక్కగా చేశాడీ కుర్రాడు' అనిపించక మానదు. అదీ మసాయోషి ప్రత్యేకత.

మసాయోషి

నర్గిస్



రాజ్ కపూర్

మీనా షోరే

లక్ష్మణ రేఖల్లో బాలీవుడ్ తారలు

దేవ్ ఆనంద్

ఆర్.కె.లక్ష్మణ్ అనగానే మనకు రాజకీయ వ్యంగ్య చిత్రాలే గుర్తొస్తాయి. రాసిపురం కృష్ణస్వామి లక్ష్మణ్‌గా మైసూర్‌లో పుట్టిన పొలిటికల్ కార్టూనిస్టు గురించి తెలియని చదువరులు వుండరు. పలకా బలపం పట్టక ముందు నుంచే బొమ్మలు గీసేవాడు లక్ష్మణ్. 'యు సెడ్ ఇట్' శీర్షిక కింద టైమ్స్ ఆఫ్ ఇండియా పాకెట్ కార్టూన్‌లో ఆయన సంధించని అంశం లేదు. సామాన్యుణ్ణి కుదిపివేసే ప్రతి అంశంపైనా కుంచె ఎక్కుపెట్టేవాడు. పెట్రోలు ధరలు, నీటి కొరత, నిరుద్యోగం మొదలుకొని వీధుల్లో చెత్త వరకూ ప్రతి సమస్యా ఆయన కార్టూన్లనో కనిపించేది. అయితే ఆయన బాలీవుడ్ ప్రముఖుల బొమ్మలు కూడా వేశారన్న విషయం పెద్దగా తెలియదు. 1952లో ఫిల్మ్‌ఫేర్ పత్రిక కోసం 'ది స్టార్స్ ఐ నెవర్ మెట్' పేరన నలభై మంది బాలీవుడ్ బిగ్ విగ్‌లను తన రేఖల్లో బంధించాడు. వాటిని ఈ మధ్య నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా విడుదల చేసింది. మీ ముందు నిలిచి కనుల విందు చేస్తున్న లక్ష్మణ రేఖలు అవే.

దుర్గా ఖోటె

అశోక్ కుమార్



నళిని జయ్‌వంత్

పద్మిని



పద్మిని

మధుబాల

గీతాబాలి